RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 295 మేడ్చల్ మల్కాజ్‌గిరి 16 నవంబర్ 2024 శనివారం పేజీలు : 4

### అవి నీచమైన, అవమానకరమైన వ్యాఖ్యలు

చెన్నై : రాజుల కాలంలో అంతఃపుర మహిళలకు సేవ చేయడానికి వచ్చిన వారే తెలుగువారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సినీనటి కస్తూరి పట్ల మద్రాస్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ వ్యాఖ్యలు ముమ్మాటికీ విద్వేష ప్రేరేపితమేనని తేల్చిచెప్పింది. ఇటీవల చెన్నైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కస్తూరి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దీనిపై తమిళనాడులో పలు చోట్ల కేసులు నమోదవ్వగా, ముందస్తు బెయిల్ కోసం కస్తూరి మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేష్ నేతృత్వంలోని మదురై ధర్మాసనం విచారణ జరిపింది. ఇప్పటికే కసస్తూరి క్షమాపణ చెప్పినందున కేసుల్ని కొట్టివేయాలని ఆమె తరఫు న్యాయవాది అభ్యర్థించగా, జాతివిద్వేష వ్యాఖ్యలు చేసిన కస్తూరికి ముందస్తు బెయిల్ ఇవ్వరాదని ప్రభుత్వం తరఫు న్యాయవాది తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది.

## రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్యా,ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే

# దేశానికే ఆదర్శం కావాలి

## ఇంటింటి కుటుంబ సర్వేపై సమీక్షించిన సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్, నవంబర్ 15: రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్యా,ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేను దేశానికే ఆదర్శవంతంగా అయ్యేవిధంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నేడు సాయంత్రం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఇంటింటి కుటుంబ సర్వే జరుగుతున్న తీరుపై అధికారులతో సమీక్షించారు.

నవంబర్ 6 వతేదీన ప్రారంభమైన ఈ సర్వేను జాప్యం లేకుండా నిర్దేశించిన కాలపరిమితిలో పూర్తి చేయడానికి కృషిచేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి దశలో నిర్వహించిన నివాసాల లిస్టింగ్ లో మొత్తం 1,16,14,349 ఇళ్లకు మార్కింగ్ చేయడమైనదని, ఈ ఇళ్లల్లో ఏ ఒక్క ఇల్లును కూడా వదలకుండా ప్రతీ ఇంటిలో సమగ్రంగా సర్వేను నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సర్వే రాష్ట్ర పౌరుల అభ్యున్నతికే సేకరించడం జరుగుతుందని, ఈ సర్వేను రాష్ట్ర గవర్నర్ వివరాలతో ప్రారంభించిన విషయాన్ని సిఎం గుర్తు చేశారు. ఇప్పటివరకు ఈ సర్వేలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారని సర్వేకు కావలసిన వివరాలను కూడా ఉత్సాహంగా అందచేస్తున్నారని సమాచారం అందుతోందని వెల్లడించారు.

సర్వేకు ఆటంకం కలిగించే వారిని ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. సర్వే జరుగుతున్న తీరును రాష్ట్ర మరియు జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి ఆటంకం లేకుండా జరిగేవిధంగా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

శుక్రవారం (15 వ తేదీ)వరకు రాష్ట్ర వ్యాప్తంగా 44.1 శాతం అంటే 51,24 ,542 ఇళ్లలో సర్వే పూర్తయిందని, ఈ సర్వేలో 87, 807 మంది సిబ్బంది, 8788 పర్యవేక్షక అధికారులు పాల్గొంటున్నారని, ప్రజల నుండి స్పందన బాగా ఉందని అధికారులు సిఎంకు వివరించారు. 52, 493 గ్రామీణ, 40 ,901 అర్బన్ బ్లాకులుగా మొత్తం 92,901 బ్లాకులుగా విభజించి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరుగుతోందని అన్నారు. ఈ సర్వే ప్రక్రియను పర్యవేక్షించాడానికి సీనియర్ ఐఏఎస్ అధికారులను ఉమ్మడి జిల్లాల వారీగా నియమించామని, క్షేత్ర స్థాయిలో ఈ సీనియర్ అధికారులు కూడా పర్యటిస్తున్నారని అన్నారు. రాష్టంలో సర్వే జరుగుతున్న తీరు పట్ల ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణిత సమయం లో సర్వే పూర్తిచేసేలా పర్యవేక్షణ అధికారులు చర్యలు తీసుకోవాలని సి.ఎం సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా మరియు ఉన్నత అధికారులు, తదితరులు హాజరయ్యారు




## పటాన్‌చెరు కాంగ్రెస్‌లో మూడు ముక్కలాట..

### ఎవరికివారే యమునా తీరే అన్నట్లుగా లీడర్ల వైఖరి

పటాన్ చెరు కాంగ్రెస్‌లో వర్గ పోరు పీక్ లెవల్‌కు చేరింది. నేతల మధ్య సఖ్యత లేక..ఒకరంటే ఒకరికి గిట్టని వైఖరితో ఉన్న నాయకుల వ్యవహార శైలి కార్యకర్తలకు అయోమయం కలిగిస్తుంది. పార్టీ పవర్‌లో ఉన్నా..యాక్టివ్‌గా పనిచేయలేకపోతున్నామని ద్వితీయ శ్రేణి నేతలు అసంతృప్తితో ఉన్నారట. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కారు దిగి కాంగ్రెస్ చేరాక పటాన్‌చెరు కాంగ్రెస్ పరిస్థితి మూడు ముక్కలాట అయిపోయిందట. మెదక్ ఎంపీగా పోటీ ఓడిన నీలం మధు, ఎప్పటి నుంచో కాంగ్రెస్‌ను అంటిపెట్టుకుని ఉన్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్‌కు , గూడెం మహిపాల్ రెడ్డి మధ్య ఏ మాత్రం సఖ్యత కన్పించడం లేదు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. ఎమ్మెల్యే చేసే కార్యక్రమాల్లో ఆమధ్య అడపాదడపా నీలం మధు కనిపించేవారు. ఇప్పుడు ఆయన కూడా యాక్టివ్‌గా లేనట్లే కనిపిస్తోంది. ఎమ్మెల్యే కూడా వీరిద్దరికీ సమాచారం ఇవ్వకుండానే కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**ప్రభుత్వ కార్యక్రమాలకు అంటీ ముట్టనట్లుగా..** గూడెం కాంగ్రెస్‌లో చేరినప్పటికీ అంత సంతృప్తిగా లేరట. హస్తం పార్టీ వ్యవహారాలు ఆయనకు మింగుడు పడటం లేదంటున్నారు. సైలెంట్ అయిపోవడంతో ఆయన వర్గం పూర్తిగా నైరాశ్యంలో ఉండిపోయింది. కాట వర్గీయులు కొందరు నీలం మధు వర్గంలో చేరిపోయి కార్యక్రమాల్లో అక్కడక్కడ కనిపిస్తున్నారు. ఇక ఎమ్మెల్యే గూడెంతో పాటు కాంగ్రెస్‌లో చేరిన అమీనుపూర్ మున్సిపల్ ఛైర్మన్ కూడా పార్టీ మారి తప్పుచేశానన్న భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఆయన పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారట. పటాన్‌చెరు నియోజకవర్గంలో పార్టీ మూడు గ్రూపులుగా విడిపోవడంతో క్యాడర్ అయోమయంలో పడిపోయింది. మరోవైపు నియోజకవర్గానికి మంత్రులెవరు వచ్చినా తనకు సమాచారం ఇవ్వడం లేదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వాపోతున్నారు. ఇటీవల కులగణన కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ చిట్కుల్ వచ్చినప్పుడు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కాట శ్రీనివాస్ గౌడ్ ఇద్దరూ డుమ్మా కొట్టగా..నీలం మధు మంత్రికి ఘనస్వాగతం పలికారు. ఇక జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ కార్యక్రమాల సమాచారం కూడా అందటం లేదని గూడెం పెదవి విరుస్తున్నారట.

**పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత విభేదాలు...** తెలంగాణ ఉద్యమ సమయం నుంచి బీఆర్ఎస్‌లో ఉన్న నీలం మధుకు, గూడెం మహిపాల్ రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత విభేదాలు ఉండేవి. ఈ ఇద్దరినీ ఎదుర్కొని నిలిచిన కాట శ్రీనివాస్ గౌడ్‌కు..వీళ్లిద్దరు కాంగ్రెస్‌లో చేరడం మింగుడు పడటం లేదు. ఒకే ఒరలో రెండు కాదు మూడు కత్తులు అయిపోయాయి. అందుకే ఇమడలేకపోతున్నారు నేతలు. ఆ మధ్య రైతు రుణమాఫీ కార్యక్రమంలో పాల్గొన్న గూడెం మహిపాల్ రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టడంతో పాటు ప్రోటోకాల్ రగడ తీవ్ర చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు బద్ధ శత్రువులుగా ఉన్న నీలం మధు, గూడెం మహిపాల్ రెడ్డిలు ఆరోజు ఒకే వేదికపై కనిపించడం, మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న కాట మాత్రం దూరంగా ఉండిపోవటం హాట్ టాపిక్ అయింది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..కాంగ్రెస్‌లో చేరిక కార్యక్రమానికి కూడా కాట శ్రీనివాస్ గౌడ్ డుమ్మా కొట్టారు. నీలం మధు మాత్రం పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతూ పార్టీ క్యాడర్‌కు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ సీనియర్లతో విభేదాలు లేకుండా జాగ్రత్త పడుతూ భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటున్నారు. పటాన్‌చెరులో బలంగా ఉన్న బీఆర్ఎస్‌ను ఢీకొట్టాలంటే ఈ ముగ్గురి నేతల మధ్య సఖ్యత లేకపోతే కష్టమేనన్న టాక్ వినిపిస్తోంది. ఈ గందరగోళ పరిస్థితులు చక్కబడాలంటే పార్టీ అధిష్టానం జోక్యం చేసుకోవాలంటున్నారు ద్వితియ శ్రేణి నేతలు.

## అక్రమ కట్టడాల నిరోధానికే మున్సిపల్ బిల్డింగ్ ట్రైబ్యునల్: పద్మనాభరెడ్డి

హైదరాబాద్: మున్సిపల్ బిల్డింగ్ ట్రైబ్యునల్ ఛైర్మన్, సభ్యుల నియామకంపై సుపరిపాలనా వేదిక అధ్యక్షుడు పద్మనాభరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. 2016లో ట్రైబ్యునల్ ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు నియామకాలు లేవన్నారు. ఛైర్మన్, సభ్యులను నియమించకపోవడంపై హైకోర్టు సైతం తీవ్ర అగ్రహం వ్యక్తం చేసినట్లు గుర్తు చేశారు. కొంతమంది బిల్డర్లు అక్రమ కట్టడాలు చేపట్టి అమా



యకులకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇళ్లను కొనుగోలు చేసి సామాన్యులు మోసపోతున్నారన్నారు. అక్రమ కట్టడాల నిరోధానికే మున్సిపల్ బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 8 ఏళ్ల క్రితమే ట్రైబ్యునల్‌లో నియామకాలు ఏర్పాటు చేసి ఉంటే ఈ స్థాయిలో నిర్మాణాలు వెలిసేవి కావన్నారు. తక్షణమే మున్సిపల్ బిల్డింగ్ ట్రైబ్యునల్ ఛైర్మన్, సభ్యులను నియమించాలని సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పద్మనాభరెడ్డి కోరారు.




# అదృష్టం పరీక్షించుకునేందుకు..!

## ఎమ్మెల్సీ సీటు.... ఎవరికి లక్కీ చాన్స్?

### అన్ని పార్టీల్లోన్నూ పోటా... పోటీ..!!

హైదరాబాద్ : త్వరలో తెలంగాణ శాసనమండలిలో 9స్థానాలు ఖాళీ కాబోతున్నాయ్... అనే నేను ఎమ్మెల్సీగా అనేందుకు అధికార, విపక్షాల్లో నేతలు ఎవరి ప్రయత్నాలు వాళ్లు మొదలుపెట్టారు. వీటిలో ఒకే ఒక్క స్థానం గులాబీ పార్టీకి దక్కనుంది.

దీంతో ఆ సీటు దక్కించుకుబోయే అదృష్టవంతుడు ఎవరా అని.. కారు పార్టీలో జోరుగాచర్చ జరుగుతోంది. ఇంతకీ ఆ ఒక్క స్థానానికి పోటీ పడుతోంది ఎవరు.. కేసీఆర్ మనసులో ఎవరి పేరు ఉంది.. పెద్దల సభలో మరికొన్ని నెలల్లో పలువురు ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. శాసనసభ్యుల కోటా, పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన నేతల పదవీకాలం కంప్లీట్ కానుంది. వీరిలో గులాబీ పార్టీకి చెందిన మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, ఎగ్గే మల్లేశం పదవీకాలం పూర్తికాబోతోంది. ఎంఐఎం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మీర్జా రియాజ్ ఉల్ ఎఫెన్దీ... పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న జీవన్ రెడ్డి... ఉపాధ్యాయ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సిరెడ్డి, రఘోత్తమ్ రెడ్డి పదవీకాలం పూర్తి కానుంది.

శాసనసభ్యుల సంఖ్యా బలంపరంగా.. అధికార పార్టీకి మెజారిటీ స్థానాలు దక్కే అవకాశాలు ఉన్నాయ్. రెండు స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఎంపిక చేసే చాన్స్ ఉంది.

**ఇప్పటి నుంచే చర్చలు మొదలు...** ఎమ్మెల్యే కోటాలో పదవీకాలం పూర్తవుతున్న నలుగురు గులాబీ నేతల్లో.. కేసీఆర్‌కు అత్యంత సన్నిహితులైన శేరి సుభాష్ రెడ్డి, మహముద్ అలీ ఉన్నారు. ఐతే త్వరలో ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతుండగా.. వచ్చే ఏడాది జరిగే ఎన్నికలపై గులాబీ పార్టీలో ఇప్పటి నుంచే చర్చలు మొదలయ్యాయ్. శాసనసభ్యుల సంఖ్యాపరంగా.. రెండు స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఎంపిక చేసే చాన్స్ ఉంది. ఐతే పది మంది ఎమ్మెల్యేలు.. బీఆర్ఎస్కు గుడ్ బై చెప్పడంతో.. ఒకే ఒక్క స్థానం మాత్రమే గులాబీ పార్టీ దక్కించుకోనుంది. ఆ ఒక్కరు ఎవరన్నది ఇప్పుడు పార్టీలో చర్చకు దారి తీస్తోంది. ఈ స్థానాన్ని ఎవరికీ కట్ట పెట్టాలన్న దానిపై పార్టీ ఒక సూత్రప్రాయ నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని.. ఈ మధ్యపార్టీ సంకేతాలు పంపుతోంది. దీంతో బీసీలకు ఈ స్థానాన్ని కేటాయించే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. బీసీ సామాజికవర్గానికి చెందిన దాసోజు శ్రవణ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గవర్నర్ కోటాలో ప్రభుత్వం నామినేట్ చేసినా గత గవర్నర్ ఆమోదం తెలుపకపోవడంతో శ్రవణ్ కు శాసనమండలి అవకాశం దక్కలేదు.

**భారీగా ఆశలు...** ఎంబీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు చెందిన నేతలు కూడా ఈ స్థానంపై భారీగా ఆశలు పెంచుకున్నారు. మైనారిటీ సామాజికవర్గానికి చెందిన వారిలో%ొ% మాజీ హోం మంత్రి మహమ్మద్ అలీ మరోసారి తనకే అవకాశం దక్కుతుందని ధీమాతో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఎమ్మెల్సీ పదవులు హామీని పొందిన పలువురు నేతలు కూడా.. తమకు ఈ విడత అవకాశం కల్పించాలని కేసీఆర్ ను కోరుతున్నట్లు తెలుస్తోంది. దేవిప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ సహా మరికొంతమంది కూడా శాసనమండలి పదవిపై భారీగా ఆశలు పెట్టుకున్నారని గులాబీ పార్టీలో చర్చ జరుగుతుంది. ఒక్క స్థానం మాత్రమే పార్టీకి దక్కే అవకాశం ఉండడంతో%ొ% ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత పరిస్థితులకు అనుగుణంగా కేసీఆర్ నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని పార్టీలో చర్చ జరుగుతోంది.

# ఏదీ.. పాదదారి..?

నల్గొండ : 565 జాతీయ రహదారి మార్గంలో రోడ్డు పక్కన ఓ మహిళ జొన్నెరొట్టెలు అమ్ముతూ జీవనం సాగిస్తోంది. ఆమె రొట్టెల వ్యాపారం చేసుకోవాలంటే ఎదురుగా ఉన్న దుకాణదారునికి నెలకు రూ.3500 చెల్లించాలి. స్థలం మాత్రం జాతీయ రహదారుల సంస్థది. అయినా ఎదురుగా ఉన్న దుకాణదారులు నడకదారులను కబ్జా చేసి చిరువ్యాపారులకు లీజులకు ఇస్తూ జేబులు నింపుకొంటున్నారు. జాతీయ రహదారి పక్కన సుమారు వంద మందికి పైగా చిరు వ్యాపారులు అప్పనంగా బాడుగ చెల్లిస్తున్నారు.

నీలగిరిలో రూ.వందల కోట్ల నిధులతో రోడ్లను విస్తరిస్తుంటే.. మరో పక్క కొందరు వ్యాపారులు రోడ్లను ఆక్రమించడం పరిపాటిగా మారింది. వీటిని ఆక్రమించి కొందరు నిర్మాణాలు చేపడుతున్నారు. మరికొందరూ వ్యాపారం నిర్వహించడం పాదచారులకు ఇబ్బంది కరంగా మారింది. వెరసి వాహనదారుల రాకపోకలకు అంతరాయం కల్గుతోంది. రోడ్ల ఆక్రమణపై నియంత్రణ లేకపోవడంతో పాఠశాలలు, కళాశాలలు సమయంలో విద్యార్థులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. రోడ్ల విస్తరణ ప్రజల కోసం కాకుండా వ్యాపారుల సౌలభ్యం కోసమే



చేసినట్లు విమర్శలు వస్తున్నాయి.

**నియంత్రణ ఏదీ..!** నకిరేకల్ వయా నల్గొండ మీదుగా మాచర్ల వెళ్లే జాతీయ రహదారి పనులు డీఈవో కార్యాలయం నుంచి సాగర్‌రోడ్డు చౌరస్తా వరకు పూర్తి కావడంతో ఇరుపైపులా నడకదారులను వ్యాపారులు ఆక్రమించారు. కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాల ఎదురుగా బస్టాప్, దుప్పలపల్లి వెళ్లే కూడలి వద్ద ఇష్టారాజ్యంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. దేవరకొండ వెళ్లే మార్గంలో ప్రైవేటు ఆస్పత్రి పక్కన వ్యాపారి ఫుట్‌పాత్‌పై హెటల్స్ నిర్వహిస్తున్నారు. మరో రెస్టారెంటు నిర్వాహకులు రోడ్డు కబ్జా చేసి బిర్యాని పాయింట్లు ఏర్పాటు చేశారు. పెట్రోల్‌బంకు సమీపంలోని వైన్ దుకాణం ఎదుట రోడ్డుపై సిట్టింగ్ సెంటర్లు నిర్వహించడంతో పాటు మరి కొందరు వ్యాపారులు తమ సామగ్రి, ఇతర వస్తువులు రోడ్డుపైనే పెడుతున్నారు. హైదరాబాద్ రోడ్డులో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. ఫుట్‌పాత్ ఆక్రమణకు గురి కావడంతో ప్రజలు యథావిధిగా రోడ్లపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు ఆక్రమిస్తే చర్యలు ముసాబ్ అహ్మద్ సయ్యద్, పుర కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి పట్టణంలో ఎక్కడైనా రోడ్లు, ఫుట్‌పాత్ కబ్జా చేసి పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తాం. ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగిస్తాం.

# మిల్లర్ల తీరుపై మండిపాటు

మిర్యాలగూడ : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా మిల్లర్లు ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తూ పలువురు రైతులు మిర్యాలగూడ మండలం బాదలాపురం, యాద్గార్‌పల్లి మిల్లుల సమీపంలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై ఆదివారం ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ.. శనివారం ఉదయం నుంచి మిల్లుల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడంతో రెండు రోజులుగా మిల్లుల వద్ద పడిగాపులు గాస్తున్నామని.. అయినా గేట్లు తెరవకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కామని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పండించామని, రోజుల తరబడి లోడ్లలో మగ్గిపోతే ధాన్యం రంగు మారే ప్రమాదం ఉందని.. దీంతో ధర తగ్గిపోయి తాము తీవ్రంగా నష్టపోనున్నామని రైతులు వాపోయారు.

**రైతుల రాస్తారోకోతో నిలిచిన వాహనాలు**

రైతులు 2 గంటల పాటు రాస్తారోకో చేయడంతో కోదాడ, మిర్యాలగూడ, యాద్గార్‌పల్లి వైపు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌లో పలు ఆర్టీసీ బస్సులు, కార్లు సైతం చిక్కుకుపోవడంతో పిల్లలు, మహిళలు అనేక అవస్థలు పడ్డారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా మిర్యాలగూడ రెండో పట్టణ, గ్రామీణ సీఐలు నాగార్జున, వీరబాబుతో పాటు గ్రామీణ, అడవిదేవులపల్లి, త్రిపురారం, మాడ్గులపల్లి ఎస్సైలు లోకేష్, శేఖర్, ప్రసాద్, కృష్ణయ్య ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆందోళన అనంతరం ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అరగంటకు పైగా సమయం పట్టింది. యాద్గార్‌పల్లి మిల్లుల వైపు రోడ్డుకు ఇరువైపులా భారీగా ధాన్యం లోడ్లు నిలిచిఉన్నాయి.

**ఫోన్‌లో మాట్లాడిన**



ఎమ్మెల్యే బీఎల్ఆర్ఎమ్మెల్యే బీఎల్ఆర్, కలెక్టర్, ఇతర అధికారులు తమ వద్దకు వచ్చి సమస్యను పరిష్కరించాలని రైతులు నినాదాలు చేశారు. పోలీసులు ఎంత నచ్చజెప్పినా రైతులు వినకపోవడంతో గ్రామీణ ఎస్సై లోకేష్.. మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్‌తో రైతులతో ఫోన్‌లో మాట్లాడించారు. అనంతరం ధాన్యం కొనుగోళ్లు తక్షణమే ప్రారంభించజేస్తామని, మద్దతు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్సై నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

**సాయంత్రం నుంచి సజావుగా కొనుగోళ్లు..**

మిర్యాలగూడ పరిధిలోని రైస్ మిల్లుల్లో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నట్లు రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ తెలిపారు. స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లా నుంచి 3వేలకు పైగా లోడ్లు రావడం, వేములపల్లి మండలం శెట్టిపాలెం వద్ద రోడ్డు ప్రమాదం జరగడంతో రహదారులపై ధాన్యం ట్రాక్టర్లు నిలిచిపోయాయన్నారు. దీంతో ఉదయం వేళలో కొంత సేపు సమస్య తలెత్తిందన్నారు. సాయంత్రానికి మరో 1,500లోడ్లు రావడంతో ఒకే రోజు మొత్తం 4,500కు పైగా లోడ్ల ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేశారన్నారు. తేమ 27శాతానికి పైగా ఉన్నప్పటికీ మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నాం.

**మూడు రోజులుగా తిరుగుతున్నా- భూక్యా నగేష్, జాలుబాయి తండా, మిర్యాలగూడ మండలం**

నేను మహేంద్ర చింట్లు రకం ధాన్యాన్ని ఐదెకరాల్లో సాగు చేసి, రెండు లోడ్లతో నుంచి మిల్లుల చుట్టూ తిరుగుతున్నా. పది మిల్లులకు పైగానే తిరిగినా కొనుగోలు చేయట్లేదు. ఇటువంటి రకాలను వ్యవసాయ అధికారులు తొలుత అనుమతులు ఇచ్చి.. ఇప్పుడు కొనుగోలు కాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం.

# ప్రమాదం అంచున నివాసం




హైదరాబాద్ : వెలుగులు పంచే విద్యుత్తు తీగలు.. కొందరి పాలిట మృత్యుపాశాలుగా మారుతున్నాయి. నివాసాలకు అత్యంత చేరువలో ఉన్న విద్యుత్తు తీగలతో విద్యుదాఘాతాల బారిన పడుతున్నారు. ఇళ్ల మీదుగా హైటెన్షన్ తీగలు వెళ్లడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోననే నివాసితులు ఆందోళన చెందుతున్నారు. చేతికి అందిందే ఎత్తులో తీగలు మేడలపై, భవనాల పక్క నుంచి వెళుతున్నాయి. నగరంలో విద్యుత్తు తీగలు ముందు ఏర్పాటు చేశారా..? ఇళ్లు ముందున్నాయా..? అంటే కరెంట్ తీగలే తొలుత ఏర్పాటు చేశారు. నగరం విస్తరించడం, జనాభా పెరగడంతో ఇళ్లు ఆయా తీగల కింద పుట్టుకొచ్చాయి. నిర్మాణాలు చేపట్టిన సమయంలోనే స్థానిక సంస్థలు, విద్యుత్తు పంపిణీ సంస్థలు అడ్డుకోకపోవడంతో పేదలు ఇళ్లు నిర్మించుకున్నారు.

**ఫిర్యాదు చేసినా అంతే :** ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ప్రాంతంలో ఇళ్ల మీద విద్యుత్తు తీగలతో స్థానికులు నిత్యం భయంతో కాలం గడుపుతున్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అతి చిన్న కాలనీగా పేరు ఉన్న అన్నానగర్(వీకర్‌సెక్షన్‌కాలనీ)లో సుమారు 236 ఇళ్లలో దాదాపు 11వందల మంది నివాసం ఉంటున్నారు.

శ్రీహరినగర్ రోడ్డులో తీగలు ఐదేళ్లకాలంలో మూడుసార్లు తెగిపడ్డాయి. ఇక్కడి చిత్తారమ్మనగర్ వద్ద నివాసాలకు సమీపంలోంచి వెళుతున్నాయి. విద్యుత్తు ఉపకరణాలు దెబ్బతింటున్నాయి. పదేళ్లలో 8 మంది దుర్మరణం చెందారు. ఇందులో ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయినా అధికారులు స్పందించడం లేదు

బాలానగర్, వినాయకనగర్, సాయినగర్, నవజీవన్‌నగర్, ఫిరోజ్‌గూడ ప్రాంతంలో ఇళ్లపైన హైటెన్షన్ విద్యుత్తు తీగలతో వినాయకనగర్‌లో ఇద్దరు వ్యక్తులు చనిపోయారు.

**ఇలా చేస్తే బాగు**

ఇళ్ల పైన ఉన్న తీగలను తొలగించి భూగర్భ కేబుల్స్ వేయడం, ఇంటికి సమీపంలో ఉన్న ఓవర్‌హెడ్ తీగల స్థానంలో ఏబీ కేబుల్స్, కవర్ కండక్టర్లు వేస్తే ప్రమాదాలు తప్పుతాయని విశ్రాంత విద్యుత్తు ఇంజినీర్లు సూచిస్తున్నారు.

**ఎంత వ్యయమవుతుంది..?**

ప్రమాదకర తీగలను తొలగించేందుకు అయ్యే వ్యయం వినియోగదారులైనా భరించాలి.. లేదంటే ప్రభుత్వమైనా ఇవ్వాలని డిస్కంలు అంటున్నాయి. స్వచ్ఛభారత్‌లో నియోజకవర్గాల వారీగా విద్యుత్తు అధికారులతో సర్వే చేయించింది. ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని ఎన్నికల ప్రచారంలో హామీలు ఇచ్చారు. తొమ్మిదేళ్ల క్రితం చేసిన సర్వేలో రూ.250 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఆ తర్వాత 2020 నాటికి రూ.450 కోట్లకు అంచనాలు పెరిగాయి.

**ఎక్కడెక్కడ ఎలా ఉన్నాయంటే..!** అడ్డగుట్ట ఏబీసీడీ సెక్షన్లు, శాస్త్రినగర్, ఏసీఎస్ నగర్, అంబేద్కర్ నగర్, తారకరామానగర్, లోహియానగర్ ప్రాంతాల్లో ఇళ్లకు చేరువలో ప్రమాదకరంగా తీగలు ఉన్నాయి. శివగంగా నగర్ బస్తీ పూర్తిగా హెటెన్షన్ తీగల కిందనే ఉంది. పాత తీగలు ప్రమాదవశాత్తూ తెగిపడి తే.. ఊహించడానికే భయంకరంగా ఉంది.రహ్మత్‌నగర్, బోరబండ పరిధిలో హైటెన్షన్ తీగల కింద ఇళ్లు, దుకాణాలు ఉన్నాయి. ఎస్పీఆర్‌హిల్స్‌లో ఆరేళ్ల పాపకు తీగలు తాకి విద్యుదాఘాతంతో తీవ్రగాయాలై ప్రాణం విడిచింది. జగద్గిరిగుట్ట షిరిడీసాయి హిల్స్‌తో పాటూ మరిన్ని ప్రాంతాల్లో ఇళ్ల మీదుగా హైటెన్షన్ తీగలు వెళ్లాయి. తొలగించాలని ఎంతోకాలంగా కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని చిన్మయ్‌మార్గ్‌లో ఇళ్ల మధ్య వేలాడుతున్న తీగలతో స్థానికులు భయపడుతున్నారు.

# 11 నెలలు ... 194 మంది అరెస్టు



సిరిసిల్ల : గంజాయి మత్తులో కొంత మంది యువత నేరాలకు పాల్పడుతూ జైలు జీవితం గడుపుతున్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. జిల్లాలో గడిచిన 11 నెలల్లో 83 కేసులు నమోదు చేసి, 194 మందిని అరెస్టు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. వీరిలో అత్యధికంగా యువకులే ఉండటం గమనార్హం. ఇప్పటికే ముగ్గురికి జైలు శిక్షతో పాటు జరిమానా పడింది. పోలీసు అధికారులు నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయడంతో సరఫరాదారులు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్న గంజాయిని గ్రామాలు, మారుమూల ప్రాంతాలను అడ్డాగా మార్చుకొని స్థానికంగా ఉన్న కొంత మంది ఏజెంట్లు నేరుగా సరఫరా చేస్తున్నారు. వాట్సప్, సామాజిక మాధ్యమాలను వినియోగించుకుని దందాను సాఫీగా సాగిస్తున్నారు. ఇది పోలీసులకు సవాల్‌గా నిలిచింది.

మరోవైపు పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, మత్తు పదార్థాలు అమ్ముతున్న, రవాణా చేస్తున్న వారిపై దృష్టిసారించారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు గానీ, డయల్ 100కు గానీ అందించాలని ప్రచారం చేస్తున్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు.

**మూలాలు వెతికి...**

గంజాయికి అలవాటు పడి కటకటాలపాలై తల్లిదండ్రులను రోడ్డున పడేస్తున్నారు. యువతకు అవగాహన కల్పిస్తే కొంత వరకు అయినా నివారించవచ్చని పోలీసుశాఖ భావించింది. మరోవైపు గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. మండలాలు, గ్రామాల్లో మత్తు పదార్థాల జాడను గుర్తించేందుకు నార్కోటిక్ డాగ్‌కు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నార్కోటిక్ డాగ్, గంజాయి కిట్‌లతో నిత్యం తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలో గంజాయి మూలాలను, కీలక వ్యక్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకొంటున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కిట్లను అందుబాటులో ఉంచడంతోపాటు కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తూ మత్తు పదార్థాల నివారణ అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తున్నారు. అయినా తరచూ ఎక్కడో ఓ చోట గంజాయి అమ్ముతూ, తాగుతూ పట్టుబడుతున్న వారిపై కేసులు నమోదు కావడం గమనార్హం.

**ఉచితంగా కౌన్సెలింగ్**

తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి మానేయలేని స్థితిలో ఉన్న వారికోసం జిల్లా కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డి–అడిక్షన్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఈ కేంద్రంలో నలుగురికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మానసిక నిపుణులతో ఉచితంగా కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు.

**రోజూ పర్యవేక్షిస్తున్నాం**

జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టి రోజూ పర్యవేక్షిస్తున్నాం. యువతకు కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గంజాయి సమాచారం కోసం సెల్ నంబరు 8712656392కు సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. అఖిల్ మహాజన్, ఎస్పీ

# నర్సరీల నిర్వహణ ఇష్టారాజ్యం

నల్గొండ : నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన రైతు యాదగిరి నల్గొండలోని ఓ నర్సరీలో మూడు వేల మిరప మొక్కల్ని కొనుగోలు చేశారు. బిల్లు ఇవ్వాలని కోరగా నిర్వాహకుడు బిల్లు పుస్తకం లేదని చెప్పారు.సూర్యాపేటకు చెందిన ముత్తయ్య జిల్లా కేంద్రంలోని ఓ నర్సరీలో టమాటా నారు కొన్నారు. రసీదు అడిగితే లేదని సమాధానం ఇచ్చారు.కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో రైతులు వాటి సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. కాయగూరల నార్ల కోసం నర్సరీలను ఆశ్రయిస్తున్నారు. కొన్ని చోట్ల రైతులు నర్సరీల వారు చేసిన లోపాలతో నష్టపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో మిరప నారు, కూరగాయల మొక్కల నారు పెంచే నర్సరీలపై పర్యవేక్షణ కరవైంది. లాభాలే ధ్యేయంగా ఇటీవల పెద్ద ఎత్తున నర్సరీలు ప్రారంభించారు. కొన్నిచోట్ల రశీదులు సైతం ఇవ్వడం లేదు.

**నష్టపోతున్న రైతులు**

నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో 65 నర్సరీలు అనుమతితో నడుస్తుండగా.. కొన్ని అనుమతి లేకుండా ఉన్నాయి. యాదాద్రిలో కనీసం ఒక్కదానికి కూడా అనుమతి లేకపోవడం గమనార్హం. వీటిలో ఎక్కువగా మిరప, టమాట, ఇతర కూరగాయల నారు పెంచారు. వర్షాల నేపథ్యంలో కొన్నిచోట్ల తోటలు దెబ్బతినడం, రైతులు మళ్లీ నాటుతుండటంతో ప్రస్తుతం మిరప మొక్కలకు గిరాకీ పెరిగింది. పంట దిగుబడులను దృష్టిలో పెట్టుకొని రైతులు విత్తనాల వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కానీ నిర్వాహకుల నుంచి సమాధానం రావడం లేదు. రశీదు లేదని.. ఇష్టం లేకుంటే వెళ్లిపోవాలని నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. దీంతో అన్నదాతలు చేసేదేమీ లేక నారు కొనుగోలు చేస్తున్నారు.

**అనుమతులు లేకుండా కొనసాగింపు**

కూరగాయల, పండ్ల నర్సరీలకు ఉద్యానశాఖ నుంచి అనుమతి తీసుకొని నిబంధనల మేర పెంచాలి. ఇష్టానుసారం నర్సరీలు ఏర్పాటు చేసి చాలా వరకు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారు. నాసిరకం నార్లు పెంచి రైతులను మోసం చేస్తున్నారు. దీనిపై ఉద్యానశాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. బాధిత రైతులు ఫిర్యాదులు చేస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఉద్యానశాఖాధికారి సాయిబాబా తెలిపారు.

**నిబంధనలు ఇవీ...**

విత్తన కంపెనీ, లాట్, బ్యాచ్ నంబరు, తయారీ తేదీ, గడువు తేదీ తప్పనిసరిగా నారు పెంచే బెడ్ల ముందు రాసిపెట్టాలి.

నారు విక్రయించిన తేదీ, పూర్తి వివరాలను రికార్డుల్లో పొందుపరచాలి.

నర్సరీలో లభించే నార్లు, ఆయా రకాల మొక్కల సంఖ్య, ధరల వివరాలు తెలుగు పట్టికను ప్రధాన ద్వారం వద్ద ప్రదర్శించాలి.

స్టాక్ రిజిస్టర్‌ను ఇన్‌వాయిస్‌లు సహా సమగ్రంగా నిర్వహించాలి.

ప్రతి నర్సరీకి రెండు ద్వారాలు ఏర్పాటు చేయాలి.

# గలగల పారే గరళం

గోదావరిఖని : దక్షిణ గంగగా కొలిచే గోదావరిపై కాలుష్య భూతం పడగ విప్పింది. స్వచ్ఛమైన నీటితో గలగలా పారే నది మురికి కూపంగా మారుతోంది. పట్టణీకరణ, పారిశ్రామిక అభివృద్ధి పవిత్ర జలాలను గరళంగా మారుస్తున్నాయి. పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు ముక్కుపుటాలదిరే దుర్గంధమే స్వాగతం పలుకుతోంది.

జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని 10 మండలాల మీదుగా గోదావరి సుమారు 135 కిలోమీటర్ల దూరం ప్రవహిస్తోంది. పరిసర ప్రాంతాల నుంచి రోజుకు 70–80 మిలియన్ లీటర్ల మురుగు, మరో 10 మిలియన్ లీటర్ల పరిశ్రమల వ్యర్థాలు, రసాయనాలు నేరుగా నదిలోకే చేరుతున్నాయి. మూసీ ప్రక్షాళన దిశగా ప్రభుత్వం నడుం బిగించిన నేపథ్యంలో గోదావరి జలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

**గొంతు తడపాలంటే భయం**

మిషన్ భగీరథ పథకం కింద పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాలకు గోదావరి నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అంతర్గాం మండలం ముర్మూర్ సమీపంలో నిర్మించిన పంపుహౌస్ ద్వారా రోజుకు 80 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసి పంపిస్తున్నారు. శుద్ధి చేసినా గోదావరి జలాలను తాగేందుకు స్థానికులు భయపడుతున్నారు. కొందరు ఇళ్లలో శుద్ధి యంత్రాలు ఏర్పాటు చేసుకోగా, మరికొందరు డబ్బాల ద్వారా కొనుగోలు చేసి తాగుతున్నారు.

**శుద్ధి కేంద్రాలతోనే అడ్డుకట్ట**

గోదావరి ప్రక్షాళనకు శుద్ధి కేంద్రాలతోనే పరిష్కారం లభించనుంది. నది పరీవాహక ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడం ద్వారా మురుగు నేరుగా నదిలోకి చేరకుండా నియంత్రించవచ్చు. పరిశ్రామిక వ్యర్థాలు, రసాయనాలను శుద్ధి చేసేందుకు ఆయా సంస్థల యాజమాన్యాలు ఎస్టీపీలు నిర్మించుకుంటే గోదావరి జలాలను కాలుష్యం బారి నుంచి రక్షించుకునే అవకాశం ఉంటుంది.

**ముక్కు మూసుకుంటేనే పుణ్య స్నానాలు**

ధర్మపురి క్షేత్రంలో నదిలో పుణ్యస్నానాలు ఆచరించే పుష్కర ఘాట్‌ల వద్ద అపరిశుభ్రతతో పాటు కలుషిత నీరు భక్తులకు ఇబ్బందికరంగా మారింది.

ధర్మపురి శివారులో ఎస్టీపీ నిర్మించాలన్న ప్రతిపాదన అమలుకు



నోచుకోవడం లేదు.

పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి రోజుకు 10 మిలియన్ లీటర్ల మురుగు పైపులైను ద్వారా మహాలక్ష్మి ఘాట్ చివరలో నదిలో కలుస్తోంది.

నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలు

రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్) రోజుకు 2000 మెట్రిక్ టన్నుల అమోనియా, 3000 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేస్తోంది.

పరిశ్రమ నుంచి ప్రతి రోజూ 3 మిలియన్ లీటర్ల రసాయనాలు నేరుగా గోదావరిలోకే చేరుతున్నాయి.

జీఎల్‌డీ ద్వారా కర్మాగారంలో వినియోగించిన నీటిని శుద్ధి చేసి ఇతర అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం రెండేళ్ల కిందట కాలుష్య నియంత్రణ మండలికి మాట ఇచ్చింది.

ఆర్ఎఫ్‌సీఎల్ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్లతో జీఎల్‌డీ(జీరో లెవల్ డిస్‌ఛార్జి) ప్రాజెక్టును నిర్మించాల్సి ఉండగా పనులు చేపట్టలేదు.

అటకెక్కిన ఎస్టీపీల నిర్మాణం

గోదావరిఖని, ఎన్టీపీసీ, రామగుండం పట్టణాల్లోని జనావాసాల నుంచి రోజుకు 50 మిలియన్ల లీటర్ల వృథా జలాలు నేరుగా నదిలోకే ప్రవహిస్తున్నాయి.సింగరేణి, రామగుండం నగరపాలక సంస్థల ఆధ్వర్యంలో మురుగు నీటిని శుద్ధి చేసే సీవేజ్ ట్రీట్‌మెంటు ప్లాంట్లు(ఎస్టీపీలు) నిర్మించి శుద్ధి చేసిన తర్వాతనే విడుదల చేయాల్సి ఉంది.నగరపాలక సంస్థ రూ.86 కోట్లతో అమృత్–2లో మల్కాపూర్, రామగుండం, సుందిళ్ల ప్రాంతాల్లో ఎస్టీపీలు నిర్మించాల్సి ఉండగా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు.

సింగరేణి రూ.19 కోట్లతో 17 ఎంఎల్‌డీల సామర్థ్యం కలిగిన ఎస్టీపీ నిర్మిస్తోంది.మహా కంటకంగా బొక్కల వాగు

మంథని పట్టణంతో పాటు కన్నాల, మల్లేపల్లి, కూచ్‌రాజ్‌పల్లి, వేంపాడు, బోయినిపేట గ్రామాల మీదుగా బొక్కలవాగు పారుతోంది.

సింగరేణి ఓసీపీ–2కు చెందిన నీరు వాగులోకి చేరుతోంది.

వాగు ద్వారా నిత్యం 10 మిలియన్ లీటర్ల మురుగు నదిలోకి చేరుతోంది. మంథని మండలం ఖానాపూర్ వద్ద బొక్కలవాగు గోదావరిలో కలుస్తోంది.

# చలికాలం.. చిన్నారులు భద్రం

సూర్యాపేట : చలి కాలం వచ్చిందంటే అందరికీ జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. ఈ కాలంలో వైరస్, బ్యాక్టీరియా సులభంగా వ్యాప్తి చెందుతాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు తరచూ జబ్బుల బారిన పడుతుంటారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇప్పటికే రాత్రి వేళల్లో చలి అధికంగా ఉంటోంది. రాబోయే మూడు నెలలు చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే హెచ్చరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది.

టీకాలు తప్పనిసరి ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్‌తో పిల్లలకు దగ్గు, జలుబు, జ్వరం రాకుండా ఉంటుంది. వీటిని ఏడాది పిల్లలకు రెండుసార్లు వేస్తారు. ఆ తరువాత ఐదేళ్ల వరకు ప్రతి సంవత్సరం ఒక్కొక్కటి చొప్పున తీసుకోవాలి. సీజనల్ టీకాలు వేయించాలి.

ఆహారం ఆవశ్యకత ఈ కాలంలో చిన్న పిల్లలు ఉండే గదులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి. చల్లని వాతావరణం కావడంతో అనేక వైరస్‌లు విజృంభిస్తాయి. పిల్లలు పాఠశాల నుంచి వచ్చిన తర్వాత అల్పాహారం తీసుకునే ముందు చేతులు, కాళ్లు బాగా కడగాలి.

విటమిన్ సీ, ఐరన్, జింక్ వంటి మినరల్స్ అధికంగా ఉన్న ఆహారాన్ని అందిస్తే రోగ నిరోధక శక్తి పెంపొందుతుంది. పండ్లు, కూరగాయలు, గోధుమలు, నాటు గుడ్లు వంటివి ఇందులో చేర్చాలి.చలి కాలంలో శరీరానికి చెమట ఎక్కువగా పట్టనందున పిల్లలు తక్కువ నీరు తాగుతుంటారు. వారితో ఎక్కువ నీరు తాగించాలి. వీలైనంత వరకు గోరువెచ్చని నీరు అందించాలి.జాగ్రత్తలివే...రాత్రి వేళ చల్లని గాలులు గదిలోకి రాకుండా చూసుకోవాలి. బయట చలిగా ఉన్న సమయంలో పిల్లలను ఎక్కువ సమయం బయట గడపకుండా జాగ్రత్తలు వహించాలి.వెచ్చగా ఉండేందుకు మందంగా ఉండే దుస్తులు లేదా స్వెట్టర్లు ధరింపజేయాలి. తలకు మఫ్లర్ (టోపీ), చేతులకు గ్లౌజులు, పాదాలకు సాక్స్ వంటి అదనపు రక్షణ దుస్తులు ధరించాలి.చలికాలంలో ముఖం, చేతులు, పాదాలు, మడమలు పగిలిపోవడం సాధారణం. తల స్నానానికి ముందు నూనె రాసి కాసేపు ఉంచిన తర్వాత స్నానం చేయించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. స్నానం వేడి నీటితో చేయించాలి. ఆ తర్వాత పొడిగా ఉండే దుస్తులను వేయాలి.

# సేవలకు వెల పేద రోగులు విలవిల..!

హైదరాబాద్ : ప్రభుత్వ దవాఖానాలకు వచ్చే రోగుల్లో 90శాతం పేదలే. ప్రైవేటులో లక్షలు పోసి వైద్యం చేయించుకోలేక చివరికి ప్రభుత్వ దవాఖానాలకు వస్తే...ఇక్కడా దోపిడీ తప్పడం లేదు. పేట్లబుర్జు ప్రసూతి ఆసుపత్రిలో రోగుల నుంచి కొందరు సిబ్బంది వసూళ్లకు పాల్పడుతుండటంతో అధికారులు నలుగురిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆసుపత్రి పరిశీలనకు వచ్చిన స్థానిక ప్రజాప్రతినిధి దృష్టికి రోగులు ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో విచారించిన అధికారులు సిబ్బందిపై వేటు వేశారు. ఈ వసూళ్ల పర్వం ఒక్క పేట్లబుర్జు ఆసుపత్రికే పరిమితం కాలేదు. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్ ఇతర ఆసుపత్రుల్లోనూ ఉంది. చేతిలో డబ్బులు లేకపోతే ప్రభుత్వ ఆసుపత్రిలోనూ వైద్యం అందే పరిస్థితి లేకుండా పోయింది. సీసీ కెమెరాలు ఉన్నా..చూసేవారెవరూ ఉండరు. స్వేచ్ఛగా డబ్బు వసూలు చేస్తున్నారు.

**వసూళ్లు ఎలా చేస్తారంటే...!**



నిలోఫర్, గాంధీ, పేట్లబుర్జు, సుల్తాన్‌బజార్ ఆసుపత్రిలో ప్రసూతి సేవలకు వచ్చే రోగులు దూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. చాలా మంది వద్ద ఖర్చులకు తప్పా...పెద్దగా చేతిలో అదనంగా డబ్బులు ఉండవు. ప్రసూతి తర్వాత ఆడపిల్ల పుడితే ఒక రేటు.. మగ పిల్లాడు పుడితే మరోరేటు కట్టి సిబ్బంది వసూలు చేస్తున్నారు.

వార్డుల వద్ద సెక్యూరిటీ సిబ్బంది కాపలా ఉంటారు. రోగులను చూసేందుకు వచ్చే బంధువుల వద్ద డబ్బులు తీసుకుంటున్నారు.

# చర్లపల్లి టెర్మినల్ మరింత ఆలస్యం

హైదరాబాద్: రహదారుల విస్తరణ పూర్తయి చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమవుతుందని అంతా భావించినా భూసేకరణలో జాప్యంతో మళ్లీ వాయిదా పడింది. అప్రోచ్ రోడ్ల కోసం వేసిన ప్రతిపాదన అమలు అంశం కొలిక్కి రాకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. టెర్మినల్‌కు దక్షిణం వైపు రెండు వంద అడుగుల రోడ్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా. ఇందుకోసం అటవీ శాఖకు చెందిన 11.68 ఎకరాల భూమిని స్వాధీనం చేయాలని పరిశ్రమల శాఖ కోరింది. ఇందుకు అటవీ శాఖ అంగీకరించగా ప్రత్యామ్నాయంగా అటవీ శాఖకు ఇచ్చే భూమి ఎక్కడనే అంశం ఇంకా ఖరారు కాలేదు. మరోవైపు రహదారుల విస్తరణలో భాగంగా మార్కింగ్ చేసిన 14 ఇళ్లను తొలగించాల్సి ఉండగా ప్రత్యామ్నాయ మార్గాల్లో రహదారులు



ఏర్పాటు చేయాలని నిర్వాసితులు అభ్యర్థిస్తున్నారు.

**ప్రతిపాదనలివీ..**40 కిలోమీటర్ల పరిధి నుంచి ప్రయాణికులు చర్లపల్లి స్టేషన్‌కి చేరేందుకు రెండు మార్గాలున్నాయి. మహాలక్ష్మీనగర్ నుంచి ఉన్న పాతరోడ్డును 80 అడుగుల మేర విస్తరించాల్సి ఉంది. టెర్మినల్ ముఖద్వారం నుంచి ఐవోసీఎల్‌ను కలుపుతూ 100 అడుగుల మేర మరో రోడ్డు విస్తరించాలని ప్రతిపాదించారు. రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులకు రూ.35 కోట్లు ఖర్చవుతాయని జీహెచ్‌ఎంసీ అంచనా వేసింది. స్టేషన్ ముందు భాగంలోని భూమిని సేకరించి ప్రధాన ద్వారాలను నిర్మించాలని, పార్కింగ్ కేంద్రాలు, బస్టాండు, ఆటోస్టాండ్‌ల నిర్మాణం చేపట్టాలని సంకల్పించింది. స్టేషన్ వెనక వైపు కొన్ని ఇళ్లను తొలగించి 80 అడుగుల రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే భూసేకరణ కొలిక్కి రాకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

# ప్రాజెక్టుల ఆధునికీకరణపై ఆశలు

జగిత్యాల : రాష్ట్ర నీటిపారుదలశాఖ ప్రాజెక్టుల ఆధునికీకరణకు పంపించిన ప్రతిపాదనలకు కేంద్ర జలసంఘం ఆమోదం తెలిపింది. రాష్ట్రప్రభుత్వం పంపించిన ప్రతిపాదనల్లో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాజెక్టులుండగా డ్యాం రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(డ్రిప్) కింద నిధులు కేటాయించి ప్రాజెక్టుల ఆధునికీకరణ, గేట్లు, ఆనకట్ట మరమ్మతు, ఆయకట్టులో నిర్మాణ మరమ్మతు తదితర పనులను చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆయకట్టులో మరమ్మతు లేమితో చివరాయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. 5.73 లక్షల ఎకరాల ఆయకట్టుకుగాను దాదాపు 1.23 లక్షల చివరాయకట్టు నీటిపారుదలకు దూరమైంది. ఈ నేపథ్యంలో ప్రధానంగా నీరందించే శ్రీరామసాగర్ పరిధి మరమ్మతులతో కాకతీయ కాలువ 0–146 కి.మీ వరకు జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు సాగునీరందనుంది. ఎల్ఎండీ మరమ్మతులతో కాకతీయ కాలువ 146 కి.మీ నుంచి దిగువకు కరీంనగర్ జిల్లాలో నీటిపారకం ఉంటుంది. శ్రీరామసాగర్, ఎల్ఎండీ దిగువ కాలువలతో పాటు ఇతర ప్రాజెక్టుల పరిధి కాలువల లైనింగ్, మరమ్మతు ఆయకట్టుకు ఉపకరించనున్నాయి. బీర్‌పూర్, ధర్మపురి మండలాలకు నీరందించే రోళ్లవాగు ఆధునికీకరణను రూ.136 కోట్లతో చేపట్టగా నిర్మాణం పూర్తికావాల్సిఉంది. వరదకాలువ, కాకతీయ కాలువల నుంచి 736 చెరువుల్లోకి నీటిని తరలించే తూముల నిర్మాణాన్ని, వాగులపై తలపెట్టిన 75 చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పూర్తిచేయటం కర్షకులకు కలిసివస్తుంది. మిషన్ కాకతీయ 3వ విడతనుంచి నిధుల చెరువుల పునరుద్ధరణ, తదుపరి సంవత్సరాల్లో మరమ్మతు నిలిచిపోగా కనీసం ఈ వేసవి వరకయినా మిగిలిన చెరువుల పునరుద్ధరణ పూర్తిచేయాల్సిఉంది. వరదకాలువలో నిండుగా నీటిని నిల్వచేయటంతో దాదాపుగా 50 వేల ఎకరాలకు రైతులు మోటార్ల ద్వారా నీటిని పారించుకుంటుండగా కాకతీయ కాలువ ఆధునికీరణను కూడా పూర్తిచేస్తే రైతులకు మరింతగా మేలు కలుగుతుంది. మధ్యమానేరు, ఎగువమానేరు, రాళ్లవాగు, శనిగరం తదితర ప్రాజెక్టులతో పాటు ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోసిన నీటిని పూర్తిస్థాయిలో నిల్వచేసుకునేలా చర్యలు చేపట్టడం ఉమ్మడి జిల్లా రైతాంగానికి దీర్ఘకాలికంగా కలిసివస్తుంది.

# కడా.. అభివృద్ధి జాడ



బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో అభివృద్ధి శకం ప్రారంభమైంది. రాజకీయంగా జన్మనిచ్చి అత్యున్నత పదవి కట్టబెట్టిన కొడంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నారు. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ(కడా)ను ఏర్పాటు చేశారు. పనుల పర్యవేక్షణకు కడాకు వెంకట్‌రెడ్డిని ప్రత్యేకాధికారిగా నియమించారు. సీఎం ప్రత్యేక చొరవతో కొడంగల్ అభివృద్ధిలో దూసుకెళ్లనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. **విద్యా నిలయంగా..:** కొడంగల్ నియోజవకర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా మారనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కోసం సమీకృత గురుకులాల పేరుతో ఒకేచోట భవనాలు నిర్మించనున్నారు. వీటికి ప్రభుత్వం రూ.110 కోట్లు మంజూరు చేసింది. వీటితోపాటు బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో కొత్త జూనియర్ కళాశాలల భవనాలకు రూ.7.13 కోట్లు, కోస్గిలో మహిళా డిగ్రీ కళాశాలకు రూ.11 కోట్లు, పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా మార్చి రూ.30 కోట్లు మంజూరు చేశారు. బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్‌లో బాలికల గురుకుల పాఠశాల భవనానికి రూ.25 కోట్లు, కొడంగల్‌లోని జ్యోతిబా పులే గురుకుల పాఠశాలలో అదనపు సౌకర్యాల కల్పనకు రూ.23.45 కోట్లు, కొత్త భవన నిర్మాణానికి రూ.25 కోట్లు వచ్చాయి. నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రూ.2,945.5 కోట్లు రాగా.. టెండర్లు ఖరారయ్యాయి. పనులు ప్రారంభం కావాల్సి ఉంది. పశువైద్య కళాశాలకు రూ.360 కోట్లు మంజూరయ్యాయి. వైద్య కళాశాల పనులు ప్రారంభం కావాల్సి ఉంది. రహదారులు, వంతెనల అభివృద్ధి పనులకు 344.50 కోట్లు మంజూరయ్యాయి.

కొడంగల్‌లో 50 పడకల ఆసుపత్రిని 220 పడకలకు ఉన్నతీకరించారు. వైద్య, నర్సింగ్, పారా మెడికల్ కళాశాలలకు ప్రభుత్వం రూ.224.50 కోట్లు మంజూరు చేసింది. కోస్గి, దౌల్తాబాద్‌లోని దేవాలయాల అభివృద్ధికి రూ.18.50 కోట్లు, బొంరాస్‌పేట మండలం నాగిరెడ్డిపల్లిలో పర్యాటక హోటల్ నిర్మాణానికి రూ.10 కోట్లు వచ్చాయి.

**సాగు, తాగునీటి సమస్యకు పరిష్కారం**కడా పరిధిలో అభివృద్ధి పనులు చేయడానికి ప్రభుత్వం రూ.4,368 కోట్లు మంజూరు చేసింది. ఇందులో నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించే నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకం ముఖ్యమైంది. గురుకుల పాఠశాలలు, ఇంజినీరింగ్, వైద్య, పశువైద్య కళాశాలలు, పర్యాటక హోటళ్లు ఏర్పాటు కానున్నాయి. నియోజకవర్గంలోని 5 మండలాల్లో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసింది. అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి మార్చిలో శంకుస్థాపన చేశారు.

# బల్దియాలో స్టిక్కర్లు.. శివారులో వివరాలు



ముషీరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే అరకొరగా మొదలయ్యింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇంకా స్టిక్కర్లు అంటిస్తుండగా, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో వివరాలు సేకరణ మొదలైంది. రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, బంజారా హిల్స్‌లోని మంత్రుల నివాస గృహ సముదాయంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటికి గణన అధికారులు వెళ్లి వివరాలు సేకరించారు. వాస్తవానికి ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకూ గణన అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి స్టిక్కర్లు అతికించాలని నిర్ణయించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇళ్లు అధికంగా ఉండడంతో తమకు కేటాయించిన ఇళ్లకు గణన అధికారులు స్టిక్కర్లు అంటించలేకపోయారు. అవసరమైన కాగితాలు సకాలంలో అందకపోవడంతోపాటు ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు మధ్యాహ్నం తర్వాత రావడంతో సర్వే మందకొడిగా సాగింది. కులం, మతం, రాజకీయ నేపథ్యం వంటి సమాచారం వెల్లడించేందుకు కొందరు తిరస్కరించారు. బ్యాంకులో రుణాలు, ఆస్తులు, బ్యాంక్ బ్యాలెన్స్ వంటి ప్రశ్నలు అడిగినప్పుడు.. చెప్పేందుకు చాలామంది ఆసక్తి చూపడం లేదు. పాతబస్తీలో కొన్ని చోట్ల స్టిక్కర్లను చింపేయగా, మరి కొన్నిచోట్ల గణన అధికారులను ఇళ్లకు రానివ్వలేదు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు సి.నారాయణరెడ్డి, గౌతమ్‌లు సర్వేతీరును పర్యవేక్షించారు.

**పాతబస్తీ.. రూటే సపరేటు..**

పాతబస్తీలోని ఏడు నియోజకవర్గాల్లో ఒక్క అసెంబ్లీ సెగ్మెంట్‌లోనూ పూర్తిస్థాయిలో స్టిక్కర్లు అతికించలేదు. స్టిక్కర్లు లేకపోవడం, మలక్‌పేట, చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో భారీ భవంతులు ఉండడంతో సమస్యలు తప్పడం లేదు. అధికారులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వడం లేదు. చాంద్రాయణగుట్ట పరిధిలో కొన్నిచోట్ల ఇళ్లకు అతికించిన స్టిక్కర్లు చించేశారు.

**స్థానిక నాయకులు వచ్చాకే..**

మలక్‌పేట, బహదూర్‌పురా, యాకుత్‌పురా, నాంపల్లి లో సర్వేకు వెళ్లిన అధికారులకు స్టిక్కర్లు ఎందుకు అతికిస్తున్నారు? మాకొద్దంటూ కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు ఇవ్వలేదు.. షాదీముబారక్ డబ్బులు రాలేదు? వివరాలను ఎందుకు చెప్పాలి? అంటూ మరికొందరు ప్రశ్నించారు. మా ఇళ్లకు రావొద్దంటూ చెప్పడంతో అధికారులు.. కార్పొరేటర్లకు ఫోన్లు చేశారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఇద్దరు కార్పొరేటర్లు వారితో మాట్లాడారు. రెండు రోజుల్లో తాము వస్తామని దగ్గరుండి వివరాలు చెప్పిస్తామనడంతో అధికారులు వెనుదిరిగారు.

**ప్రొ ఫార్మాల కొరత...**

సర్వే కోసం అధికారులు లక్షల సంఖ్యలో స్టిక్కర్లు, ప్రొఫార్మాలను తెప్పించినా, సరిపోలేదు. జీహెచ్‌ఎంసీ పరిధిలో మూడు రోజులకు 85 శాతం ఇళ్లకే స్టిక్కర్లు అతికించారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోనూ ఇదే పరిస్థితి. ఖైరతాబాద్, నాంపల్లి, విజయనగర్ కాలనీ, అమీర్‌పేట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్, బాలానగర్, సికింద్రాబాద్, ముషీరాబాద్, నారాయణగూడ, ఆబిడ్స్ ప్రాంతాల్లో 40 శాతం ఇళ్లకు శనివారం రాత్రికి కూడా స్టిక్కర్లు అతికించలేదు. చేవెళ్ల, శంకర్‌పల్లి, ఎదులాబాద్, యాచారం, కందుకూరు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, షాబాద్, తలకొండపల్లి, కేశంపేట్, నందిగామ వంటి ప్రాంతాల్లో, పాస్‌బుక్ వివరాలు, ఆస్తులు, రుణాల వంటి ప్రశ్నలకు జవాబులు చెప్పడం లేదు.

ఘట్‌కేసర్, పోచారం, శంషాబాద్, గుండ్లపోచంపల్లి, ఆదిభట్ల, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలు, ఫిర్జాదీగూడ, బోడుప్పల్, జవహర్‌నగర్, నిజాంపేట, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్లలో శనివారం మధ్యాహ్నం నుంచి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు.

# భూ తగాదాలు.. పోలీస్ పంచాయితీలు

హైదరాబాద్: భూ వివాదాల్లో తలదూర్చొద్దని.. ఎస్‌వోపీ ప్రకారమే నడుచుకోవాలని ఉన్నతాధికారులు పదేపదే హెచ్చరిస్తున్నా.. కొందరు పోలీసు అధికారులు మాత్రం చెలరేగిపోతున్నారు.. సివిల్ పంచాయితీల్లో జోక్యం చేసుకుంటున్నారు. అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘిస్తూ బాధితుల్ని భయభ్రాంతులకు గురిచేసి మరొకరికి వంత పాడుతున్నారు. తాజాగా శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఎస్ఐ వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగా మారింది. అసైన్డు భూముల్లో సాగుచేసుకుంటున్న రైతుల్ని వెళ్లిపోవాలంటూ బెదిరింపులకు గురిచేయడం వివాదాస్పదమైంది. ఎవరి నుంచి ఫిర్యాదు లేకున్నా.. రాత్రి భూముల్లోకి ప్రవేశించడం, ఖాళీ చేయాలంటూ బెదిరించడంతో రైతులు ఎదురుతిరిగారు. వారి ఆందోళనతో ఈ ఘటన వెలుగులోకి వచ్చినా.. నగర శివారు ప్రాంతాల్లో పలుచోట్ల లోపాయకారీగా ఇలా సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయి. గతేడాది డిసెంబరులో భూతగాదాల్లో మితిమీరి జోక్యం చేసుకున్నారనే కారణంతో రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్లలోని పహాడీషరీఫ్, ఆర్జీఐఏ ఇన్‌స్పెక్టర్లు సస్పెండయ్యారు. మోకిల, ఆర్జీఐఏ, మెయినాబాద్, నార్సింగి ఇన్‌స్పెక్టర్లపై బదిలీ వేటు పడింది. అయినా కొందరి తీరులో మార్పురావడం లేదు. భూవివాదాల్లో



పోలీసులు జోక్యం తరచూ వివాదాస్పదం అవుతున్నారు.

**ఉన్నతాధికారుల కళ్లుగప్పి**

భూతగాదాల్లో జోక్యం చేసుకుంటున్న ఉదంతాలు ఎక్కువగా శివార్లలోనే వెలుగుచూస్తున్నాయి. మూడు కమిషనరేట్లలో ఠాణాలకు వచ్చే కేసుల్లో 10 శాతం దాకా భూతగాదాలవే. రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్లలోని శివారు ప్రాంత పోలీస్‌స్టేషన్లలో దొంగతనాల తర్వాత ఇలాంటి ఫిర్యాదులే అధికంగా వస్తాయి. భూ తగాదాలు సివిల్‌వని.. కొందరు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు అసలు పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. ఆక్రమణదారులతో చేతులు కలిపి బాధితులపైనే కేసులు నమోదుచేస్తున్నారు. ఎంతోకొంత తీసుకొని సమస్య పరిష్కరించుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు.

# ఆధ్యాత్మిక క్షేత్రం... పచ్చదనం గగనం

ధర్మపురి: ఆధ్యాత్మిక క్షేత్రంగా ఖ్యాతిగాంచిన ధర్మపురి పట్టణంలో పచ్చదనం కనుమరుగవుతోంది. గత ఏడాది అట్టహాసంగా నాటిన మొక్కల సంరక్షణ లేకపోగా, చాలా చోట్ల మొక్కలను నాటకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. గతంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా భారీ వృక్షాలుండేవి. రోడ్ల వెడల్పు, అభివృద్ధి పనుల్లో భాగంగా వాటిని తొలగించారు. అప్పటి నుంచి పట్టణంలో పచ్చదనం కరవై భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డివైడర్ల మధ్య పచ్చదనం పెంపొందించాలని రూ.లక్షల వ్యయంతో మొక్కలను నాటారు. సంరక్షణను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. పట్టణంలో నంది నుంచి గాంధీ, గాంధీ నుంచి పటేల్, పటేల్ నుంచి వివేకానంద కూడలి, వివేకానంద కూడలి నుంచి అంబేద్కర్ కూడలి వరకు గతంలో వందకు పైగా భారీ వృక్షాలుండేవి. వీటికింద స్థానికులు, భక్తులు సేదతీరేవారు. ఒకప్పుడు ఈ చెట్ల నీడ కిందనే ఆర్టీసీ బస్టాండు, కూరగాయల మార్కెట్ ఉండేది. నీడతో పాటు, భూగర్భజల సంరక్షణకు ఇవి ఎంతో తోడ్పాటు అందించేవి.



గతంలో ధర్మపురి పట్టణంలో ఎక్కడ బోరువేసినా కేవలం 60 అడుగుల లోతుతోనే నీటి ఊట లభ్యమయ్యేది. గత పదేళ్లుగా 500 అడుగుల లోతులో బోరువేసినా నీరు అంతగా లభించడం లేదు. వృక్షాల సంరక్షణ చేపట్టకపోవడంతోనే ఈ దుస్థితి తలెత్తిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రూ.4 లక్షలు వెచ్చించినా...**

పట్టణ ప్రగతి, హరితహారం కార్యక్రమంలో భాగంగా గత ఏడాది రూ.4 లక్షల వ్యయంతో 64 వేల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, సుమారు 32వేల మొక్కలు నాటారు. కేవలం 77 శాతం మాత్రమే లక్ష్యాన్ని సాధించినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో మొక్కల పెంపకంపై పుర అధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలున్నాయి. ఈ పథకం కింద ఇప్పటి వరకు మొక్కలను నాటినట్లు రికార్డుల ద్వారా చెబుతున్నా, వీటిని సంరక్షించేందుకు, నీటిని పోసేందుకు, ట్రీగార్డులను ఏర్పాటు చేసేందుకు కనీస చర్యలు కరవయ్యాయి. సమీకృత మార్కెట్, గోదావరి తీర ప్రాంతంలో నేటికీ మొక్కలను నాటలేదు.

**చర్యలు తీసుకుంటాం**కె.శ్రీనివాస్, పుర కమిషనర్, ధర్మపురిధర్మపురి పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడతాం. నాటిన మొక్కలను సంరక్షించేలా చర్యలు తీసుకుంటాం. మార్కెట్, గోదావరినది తీరాల్లో మళ్లీ మొక్కలు నాటేందుకు చర్యలు చేపడతాం.

# ఉన్నతీకరించక.. ఉన్నది చాలక

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణం డివిజన్ కేంద్రంగా మారి రోజురోజుకు విస్తరించడమే కాకుండా జనాభా పెరుగుతోంది. ఈ క్రమంలో ఇక్కడి సామాజిక ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. ఆసుపత్రిని ఉన్నతీకరించి సౌకర్యాలు మెరుగుపర్చడంపై దృష్టిసారించకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఏళ్ల కిందట మెట్‌పల్లిలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేశారు. ఇప్పటికీ అధికారికంగా ముప్పై పడకల ఆసుపత్రిగా కొనసాగుతున్నప్పటికీ రోగుల తాకిడితో 72 పడకలు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రికి జిల్లాలోని మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలతో పాటు పొరుగు జిల్లాలైన నిజామాబాద్, ఆదిలాబాద్‌లోని కొన్ని మండలాల నుంచి చికిత్స నిమిత్తం రోగులు వస్తుంటారు. జ్వరాల సీజన్‌లోనైతే ఆసుపత్రి ఓపీ విభాగం రోగులతో కిటకిటలాడుతోంది. కొన్నిసార్లు పడకలు సరిపోక ఒకే మంచంపై ఇద్దరేసి రోగులను పడుకోబెట్టి వైద్యం అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పట్టణం మీదుగా జాతీయ రహదారి ఉండగా తరచూ ప్రమాదాలు జరుగుతాయి. ప్రమాద బాధితులకు చికిత్స, మృతి చెందిన వారికి శవపరీక్ష కోసం ఆసుపత్రికి తీసుకొస్తారు. ఆసుపత్రిని వంద పడకలుగా మార్చాలనే డిమాండ్ ఉన్నా ఉన్నతీకరించడం లేదు. ఫలితంగా మెరుగైన వైద్యానికి జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది.

**సరిపోని భవనం**

ఏళ్ల కిందట నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడంతో గత ప్రభుత్వం నూతన భవనానికి నిధులు మంజూరు చేసింది. సిమెంటు పనులు పూర్తికాగా ఇంకా కొన్ని పనులు మిగిలిపోయాయి. ప్రస్తుతం ఉన్న భవనం రోగుల తాకిడికి ఎటూ సరిపోవడం లేదు. ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు కూర్చొని ఓపీ చూడాల్సి వస్తోంది. ఓపీ చీటి రాయించుకోవడం, మందులు తీసుకోవడం, ల్యాబ్ పరీక్షలు పక్కపక్కనే ఉండడంతో రోగులతో కిక్కిరిసిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. వార్డు గదుల పైకప్పు, ఆపరేషన్ థియేటర్ వద్ద పెచ్చులూడాయి. కిటికీలకు తలుపులు సరిగా లేవు. వర్షానికి గదులు ఉరుస్తున్నాయి. ఎక్స్‌రే గది ఉరవడంతో యంత్రాలకు ఇబ్బందిగా మారింది. రక్తనిల్వ కేంద్రానికి పరికరాలు వచ్చినా గదులు లేక వినియోగించడం లేదు.

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు నమోదైన ఓపీ : 46,759

ఐపీ : 4,884

జనరల్ శస్త్రచికిత్సలు: 132

ప్రసవాలు : 912

**ఖాళీలతో ఇబ్బందులు**

ఆసుపత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. సివిల్ సర్జన్ నిపుణులు ఐదుగురికి ఇద్దరే ఉన్నారు. డిప్యూటీ సివిల్ సర్జన్లు ఆరుగురికి ఒకరు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో ఒక పోస్టు ఖాళీగా ఉంది. సివిల్ అసిస్టెంట్ సర్జన్లు 12కు అయిదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా ఈ ఆసుపత్రిలో ఎక్కువగా ప్రసవాలు జరుగుతుండగా ముగ్గురికి ఇద్దరు మాత్రమే ఉన్నారు. అందులో ఒకరు డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. మరో గైనకాలజిస్టును నియమిస్తే మరిన్ని ప్రసవాలు పెరుగుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రోడ్డు ప్రమాద కేసులు వచ్చిన సమయంలో చికిత్స అందించేందుకు ఆర్థోపెడిక్ వైద్యులు లేరు. రోడ్డు ప్రమాద కేసులు ఈ ఏడాది ఇప్పటి వరకు వందకు పైగా రాగా నలభై వరకు ఇతర ప్రాంతాలకు రెఫర్ చేసినట్లు తెలుస్తోంది. మత్తు వైద్యుడి పోస్టు ఒకటి ఖాళీగా ఉంది. జనరల్ సర్జన్ ఇద్దరికి ఒక్కరే ఉన్నారు. రేడియాలజిస్ట్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.




రాంచీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయాణించాల్సిన ఎయిర్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక సమస్య ఎదురైంది. ఝార?ండ్‌లో ఎన్నికల ప్రచారం ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో దిల్లీకి ప్రధాని తిరుగు ప్రయాణం ఆలస్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం ఈ ఉదయం ప్రధాని మోదీ ఝార్ఖండ్‌లో పర్యటించారు. రెండు ప్రాంతాల్లో ర్యాలీల్లో పాల్గొన్నారు. దాన్ని ముగించుకుని దిల్లీ తిరిగి వెళ్లేందుకు దేవ్‌గఢ్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే ప్రధాని ప్రయాణించాల్సిన ఎయిర్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో టేకాఫ్ అవ్వలేదు. ప్రస్తుతం సాంకేతిక బృందం సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తోంది. మరోవైపు, ఇదే రోజున ఝార్ఖండ్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెలికాప్టర్ కూడా గంటకు పైగా నిలిచిపోయింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి అనుమతి రాకపోవడంతో గోడ్డాలో ఆగిపోయింది. దీంతో రాహుల్ గాంధీ షెడ్యూల్‌కు ఆటంకం ఏర్పడింది. అయితే, దీనికి భాజపానే కారణమని కాంగ్రెస్ ఆరోపించింది. ఝార్ఖండ్‌లో ఈ నెల 13న తొలి విడత పోలింగ్ జరగ్గా.. నవంబరు 20న మహారాష్ట్రతో పాటు రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 23న ఫలితాలను వెల్లడించనున్నారు.



## తెలుగు రాష్ట్రాల నుంచి శబరిమలకు 8 ప్రత్యేక రైళ్లు..

హైదరాబాద్: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. శబరిమల క్షేత్రానికి వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపింది.

తెలుగు రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాలను కలుపుతూ 8 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఈ నెల 22, 29 తేదీల్లో మౌలాలి(హైదరాబాద్)-కొల్లాం, ఈనెల 24, డిసెంబర్ 1వ తేదీల్లో కొల్లాం- మౌలాలి, నవంబర్ 18, 25 తేదీల్లో మచిలీపట్నం-కొల్లాం, నవంబర్ 20, 27 తేదీల్లో కొల్లాం- మచిలీపట్నం ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే పేర్కొంది. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

## పేదలకు గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం.. ఇల్లు కట్టిస్తాం: చంద్రబాబు



అమరావతి: పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల భూమి ఇచ్చి ఇళ్లు కట్టించి ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. డిసెంబరులో లక్ష ఇళ్లలో గృహ ప్రవేశాలు చేసేలా కార్యాచరణ చేస్తున్నామన్నారు. ఒకే రోజు అన్ని పనులు చేస్తామని తమ ప్రభుత్వం చెప్పటం లేదని అన్నారు. నక్కపల్లి, కొప్పర్తి తదితర పారిశ్రామిక జోన్‌లకు రూ.10వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. “ఎప్పుడూ జరగని విధ్వంసం రాష్ట్రంలో జరిగింది. అధికారులు, వ్యవస్థలు నిర్వీర్యం అయిపోయాయి. ప్రతీ వ్యవస్థను ఇప్పుడు గాడిలో పెడుతున్నాం.

మొత్తం బడ్జెట్ రూ.2.94లక్షల కోట్లు.. గతేడాది కంటే ఎక్కువ. ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఒక మంచి బడ్జెట్‌ను తీసుకు రాగలిగాం. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలగకుండా పట్టుదలతో కృషి చేస్తున్నాం. ఒక మంచి ప్రభుత్వం వల్ల ప్రజల జీవితాలు ఎలా మారాయనేది ఆలోచించాలి” అని చంద్రబాబు అన్నారు.

## శాసనమండలిలో దుమారం..వైకాపా సభ్యుల వాకౌట్



అమరావతి: రాష్ట్రంలో వైద్య కళాశాలల నిర్మాణంపై శాసనమండలిలో దుమారం రేగింది. వైద్యకళాశాల నిర్మాణం విషయంలో నాటి సీఎం జగన్ పక్షపాతం చూపారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పులివెందుల కాలేజీకి తప్ప.. మిగతా ఏ కళాశాల నిర్మాణానికీ సరిపడా నిధులివ్వలేదన్నారు.

అధ్యాపకులకు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం వల్లే.. ఈ ఏడాది వైద్యకళాశాలల నిర్వహణకు జాతీయ వైద్య మండలి అనుమతివ్వలేదని తెలిపారు. దీనంతటికీ కారణమైన జగన్ మళ్లీ కూటమి ప్రభుత్వాన్ని నిందిస్తున్నారని సత్యకుమార్ మండిపడ్డారు. ఏడాదిలో తాడేపల్లి ప్యాలెస్ నిర్మించుకున్న జగన్.. వైద్యకళాశాలలు పూర్తి చేయలేకపోయారని దుయ్యబట్టారు. మంత్రి సమాధానం సరిగా లేదంటూ వైకాపా సభ్యులు వాకౌట్ చేశారు.

## పోసానికి బిగుస్తున్న ఉచ్చు.. ఏక్షణమైనా అరెస్ట్



అల్లూరి జిల్లా, నవంబర్ 15: సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో కేసుల పర్వం కొనసాగుతోంది. వైసీపీ నాయకులు, సినీ నటుడు పోసాని కృష్ణ మురళిపై వరుసగా కేసులు నమోదు అవుతున్నాయి. తాజాగా పాడేరు పోలీస్‌స్టేషన్‌లో పోసానిపై కేసు నమోదు అయ్యింది. ఇప్పటికే పోసానిపై ఏపీ వ్యాప్తంగా పదుల సంఖ్యలో కేసులు నమోదు కావడంతో ఉచ్చు బిగుస్తోంది. పోసానిని అరెస్ట్ చేయాలంటూ పలు డిమాండ్లు వినిపిస్తున్నాయి. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ప్రతిపక్ష పార్టీ అయి టీడీపీ, జనసేన నేతలపై ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు చేశారని.. అతడిని అరెస్ట్ చేయాలని కేసులు నమోదు అవుతున్నాయి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై సోషల్ మీడియాలో పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఆయనపై ఫిర్యాదు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కరోజే పోసానిపై రాష్ట్ర వ్యాప్తంగా 22 కేసులు నమోదు అయ్యాయి. టీడీపీ, జనసేన నేతలు పోసాని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. వీటిలో ఐదుచోట్ల పోలీసులు కేసులు నమోదు చేశారు. అనంతపురంలో పోసాని దిష్టి బొమ్మను తెలుగు యువత, ఎస్సీ సెల్ నాయకులు దహనం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను అసభ్యకరంగా దూషించారంటూ నమోదైన కేసులో విచారణకు హాజరు కావాలని పోసానికి రెండు, మూడు రోజుల్లో నోటీసులు జారీ చేస్తామని విజయవాడ భవానీపురం పోలీసులు తెలిపారు. అలాగే శ్రీకాకుళం పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో పోసానిపై శ్రీకాకుళం పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ ఫిర్యాదు చేశారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడుపై అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేసినందు గాను పోసానిపై చర్యలు తీసుకోవాలని స్థానిక టీడీపీ నేతలు టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎ.విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అటు విజనగరంలోనూ పోసానిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యారు చేశారు టీడీపీ నేతలు. కూటమి నాయకులపై అనుచిత వాఖ్యలు చేస్తూ వారి మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన పోసానిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టీడీపీ విజయనగరం ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత, ఐటీ మంత్రి నారా లోకేశ్, టీటీడీ చైర్మన్‌పై పోసాని కృష్ణ మురళి అసత్య ఆరోపణలు, పరుస పదజాలంతో మాట్లాడారని, రెచ్చగొట్టే వ్యాఖ్యలను చేసి వారి గౌరవానికి భంగం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అలాగే రాజాం పోలీస్‌స్టేషన్‌లోనూ పోసానిపై కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.

## బడ్జెట్‌పై ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆసక్తికర చర్చ



అమరావతి, నవంబర్ 15: ఏపీ అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ( ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చట్టంలో ఇంట్లో ఆరు మద్యం బాటిళు మాత్రమే పెట్టుకోవడానికి అనుమతి ఉందని.. గత ప్రభుత్వ హయంలో ఒక్క బాటిల్ ఎక్కువ ఉన్నా జగన్ జైల్లో వేసేస్తాడని పెట్టుకోలేదన్నారు. మంచి మద్యం అక్కడా ఇక్కడా తెచ్చి ఇంట్లో ఆరు బాటిళ్ళు పెట్టుకొని మిగలినవి దాచిపెట్టమని ఫ్రెండ్స్‌కు ఇచ్చేవాళ్లమని.. అయితే వారు తమకు గిఫ్ట్‌గా ఇచ్చారనుకొని ఖాళీ చేసేసే వారన్నారు. ఇది చాలా పెద్ద సమస్య కాబట్టి బిజినెస్ హూస్‌లకు అయినా ఈ కోటా పెంచాలని ఎక్సైజ్, హోంశాఖా మంత్రులను కొరుతున్నానన్నారు. “ఈ విషయం సభలో చెప్పొద్దు బాగోదు అని మా వాళ్లు అన్నారు. అయితే ఇది చాలా ముఖ్యమైనది ఇబ్బంది పడే విషయం అందుకే చెప్పేశా” అని అన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు నుంచి వచ్చే ఆదాయం రూ.4000 కోట్లు పెంచి చూపించారు అది ఎలా వస్తుందని ప్రశ్నించారు. రూ.25,595 కోట్లు ఎక్సైజ్ ద్వారా వస్తుందని మంత్రి కూడా చెప్పారన్నారు. అయితే గత పభుత్వనికి కూడా ఇంత వచ్చి ఉంటుందనే అనుమానం ఉందన్నారు. అంటే కనీసం రూ.10 వేల కోట్లు ప్రతి ఏడు వాళ్లు కొట్టేశారని మండిపడ్డారు. తమ లెక్కల ప్రకారం లిక్కర్‌లోనే వైసీపీ రూ.30 వేల కోట్లు కొట్టేసిందని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆరోపించారు. కాగా..మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సభలో బడ్జెట్‌పై చర్చను ప్రారంభించారు. 62 శాతం మంది రైతు బిడ్డల కోసం అత్యధికంగా బడ్జెట్ కేటాయించారన్నారు. గత అయిదేళు గా వ్యవసాయ శాఖను పూర్తిగా మూత వేసేశారన్నారు. రీసర్వే కావాలని ఎవ్వరు అడిగారు.. ప్రతి రైతుపై భారం వేశారన్నారు. పాస్ బుక్‌లు, రాళ్లపై ఫోటోలు పేర్లు ఏంటి అని ప్రశ్నించారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ ఎంతో దుర్మార్గమైనదన్నారు. అసెంబ్లీకి 11 మంది ఎందుకు రారని ప్రశ్నిస్తున్నామన్నారు. రాను అని ఎమ్మెల్యేలు చెప్పాక కూడా వారిని ఇక్కవ ఉంచాలా అని ప్రశ్నిస్తున్నట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి అన్నారు.

## ఆర్థిక ఉగ్రవాది ఏం చేశారో గత ఐదేళ్లలో చూశాం: మంత్రి పయ్యావుల



అమరావతి: ఆర్థిక ఉగ్రవాది ఏం చేశారో గత ఐదేళ్లలో చూశామని మంత్రి పయ్యావుల కేశవ్ (%ుఖఎఋఙజబశ్రీఖ నెవంష్ఠుజ%) అన్నారు. బడ్జెట్‌పై ఆయన శాసనసభలో ప్రసంగించారు. “ఐదేళ్ల పాటు రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారు. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు వీలు లేకుండా చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను ఎలా పిలవాలో అర్థం కావట్లేదు. ఐదేళ్లలో ప్రతి శాఖలోనూ ఆర్థిక అరాచకమే జరిగింది. దేనికీ సరైన లెక్కలు, జమా ఖర్చులు లేవు. గత ప్రభుత్వం అంకెల గారడీతో అన్ని వ్యవస్థలను అస్తవ్యస్తం చేసింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలను తప్పుదారి పట్టించింది. ఇప్పుడు కూడా అంకెల గారడీ చేసి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంట్రాక్టర్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టారు. గత ప్రభుత్వ వైఖరితో అనేక మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారు. పిల్లలకు ఇచ్చే చిక్కీల బిల్లులు కూడా పెండింగ్‌లో పెట్టారు. ఫీజు రీయంబర్స్ చేయకపోవడంతో కళాశాలల విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వలేదు. మేం వచ్చాక సర్టిఫికెట్లు ఇప్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా పక్కన పెట్టింది. పోలవరం పనులు నిలిపివేసి డయాఫ్రమ్ వాల్ విధ్వంసానికి కారణమయ్యారు. రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదు. సూట్‌కేస్ కంపెనీలు.. బ్రీఫ్‌కేస్ కంపెనీలు.. క్విడ్ ప్రో కో పదాలు పరిచయం చేశారు. గత పాలకులు చేసిన ఇసుక, మద్యం మాఫియా అందరికీ తెలుసు. చట్ట సభల అనుమతి లేకుండా రూ.634 కోట్లు ఖర్చు చేసినట్లు కాగ్ చెప్పింది. అనుమతి లేని ఖర్చులు ఎవరి కోసం చేశారు? ఎందుకు చేశారు? వైకాపా హయాంలో పారిశ్రామికవేత్తలు పక్క రాష్ట్రాలకు పారిపోయారు. చంద్రబాబు వచ్చాక మళ్లీ అనేక మంది వస్తున్నారు. అమరావతి విధ్వంసం.. విశాఖ భూ దోపిడీ మీ అరాచకం కాదా? సంక్షేమం.. అభివృద్ధి.. బ్యాలెన్స్ చేసుకుంటూ బడ్జెట్ ప్రవేశపెట్టాం. రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చేందుకు మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారు. అమెరికా పర్యటనలో ఆయన 90 మంది పారిశ్రామికవేత్తలను కలిశారు.” అని పయ్యావుల కేశవ్ తెలిపారు.

## కబ్జాదారుల గుండెల్లో దడ పుట్టించేలా శిక్షలు: మంత్రి అనగాని



అమరావతి: గత ప్రభుత్వంలో 13.59 లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్ చేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శాసన మండలిలో ఆయన మాట్లాడారు. “గత ప్రభుత్వంలో 25వేల ఎకరాల భూమి అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు జరిగాయి. నిబంధనలకు విరుద్ధంగా 7,837 ఎకరాల్లో అక్రమాలు జరిగాయి. భూ కబ్జాలు అరికట్టేందుకే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తెస్తున్నాం. భూకబ్జాలకు పాల్పడిన వారికి 10-14 ఏళ్లు శిక్ష పడేలా కొత్త చట్టం ఉంటుంది. కబ్జాదారుల గుండెల్లో దడ పుట్టించేలా శిక్షలు ఉంటాయి. పేదల భూములు అన్యాక్రాంతం కాకూడదనే కొత్త చట్టం తీసుకొస్తున్నాం. మదనపల్లెలో 13 వేల ఎకరాల్లో పేర్లు మార్చారు. అక్కడి భూ అక్రమాల్లో ఎవరున్నా శిక్షిస్తాం” అని అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

## మహారాష్ట్ర మహాయుతిలో చిచ్చుపెట్టిన యోగి నినాదం



ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ మహాయుతిలో లుకలుకలు బయటపడటం చర్చనీయాంశమైంది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలే ఇందుకు కారణమయ్యాయి. ఇటీవల ఎన్నికల ప్రచారం సందర్భంగా యోగి ఓ నినాదం ఇచ్చారు. దీన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఎన్సీపీ నేత అజిత్ పవార్ వ్యతిరేకించారు. దీంతో పవార్ తీరుపై మరో డిప్యూటీ సీఎం, భాజపా నేత దేవేంద్ర ఫడణవీస్ బహిరంగగానే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. అసలేం జరిగిందంటే.. మహారాష్ట్రలో భాజపా స్టార్ ప్రచారకర్తగా ఉన్న యోగి ఆదిత్యనాథ్ ఇటీవల ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ.. ‘విడిపోతే చస్తారు (ప్రజలను ఉద్దేశిస్తూ)’ అన్న అర్థంలో ఓ నినాదం ఇచ్చారు. గతంలోనూ ఆయన పలు సందర్భాల్లో ఈ నినాదాన్ని ఉపయోగించారు. అయితే, ఈ వ్యాఖ్యలపై సొంత నేతల నుంచి వ్యతిరేకత ఎదురైంది. మహారాష్ట్ర అధికార మహాయుతి సంకీర్ణ ప్రభుత్వంలోని మిత్రపక్షాలతో పాటు కొంతమంది భాజపా నేతలు కూడా యోగి వ్యాఖ్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అజిత్ పవార్ దీనిపై స్పందిస్తూ.. “ఆ నినాదాన్ని నేను సమర్థించను. దీని గురించి ఇప్పటికే చాలా సార్లు చెప్పా. బహుశా ఝార్ఖండ్, యూపీ వంటి రాష్ట్రాల్లో ఈ నినాదం పనిచేస్తుందేమో గానీ.. అంబేడ్కర్ సూత్రాలను పాటించే మహారాష్ట్ర నేలపై దీనికి స్థానం లేదు. భాజపా నేత పంకజ ముండే కూడా దీన్ని వ్యతిరేకించారు” అని అన్నారు. తాజాగా ఈ వ్యాఖ్యలపై భాజపా నేత, మాజీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. “అజిత్ పవార్ కొన్ని దశాబ్దాల పాటు హిందూ వ్యతిరేక సిద్ధాంతాలతో కలిసి పనిచేయాల్సి వచ్చింది. అందుకే ఇంకా ఆయనపై మాజీ మిత్రుల (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) ప్రభావం ఉన్నట్లుంది. జనాల నాడి, అభిప్రాయాలను అర్థం చేసుకునేందుకు ఆయనకు ఇంకా కొంత సమయం పడుతుంది” అని అన్నారు. దీంతో రాజకీయంగా ఈ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్రలో నవంబరు 20న ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 23న ఫలితాలను వెల్లడించనున్నారు.

## నా రాజీనామా ఆమోదించండి: ఎమ్మెల్సీ కల్యాణ చక్రవర్తి



అమరావతి: శాసనమండలి ఛైర్మన్ తన హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తుండటం దారుణమని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి విమర్శించారు. మండలి సభ్యత్వానికి తాను రాజీనామా చేసి దాదాపు రెండు నెలలు దాటిందని.. తాను వ్యక్తిగతంగా హాజరై ఛైర్మన్‌కు రాజీనామా పత్రం అందజేసినట్లు చెప్పారు. ఆ తర్వాత పలుమార్లు ఛైర్మన్‌ని కలిశారని.. గురువారం మరోసారి రాజీనామాను ఆమోదించమని కోరినట్లు పేర్కొన్నారు. అయినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇంకా రాజీనామా ఆమోదించకపోవడం తన హక్కులను కాలరాయడమేనని కల్యాణ చక్రవర్తి అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

## చట్ట సవరణ చేసైనా.. ఆ ఎమ్మెల్యేల సభ్యత్వాలను రద్దు చేయాలి: సోమిరెడ్డి

అమరావతి: అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేల సభ్యత్వాలను అవసరమైతే చట్ట సవరణ చేసైనా రద్దు చేయాలని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు సభలో ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. “ఓ విద్యార్థి కొన్ని రోజులు పాఠశాలకు వెళ్లకపోతే ఉపాధ్యాయులు మందలిస్తారు. కనీసం పరీక్షలకు కూడా రాకపోతే డిబార్ చేస్తారు. అసెంబ్లీకి మేం రాం అని సభ్యులు చెప్పిన తర్వాత వారిపై ఏదో ఒక చర్య తీసుకోవాలి” అని కోరారు.

## రష్మిక నాన్ స్టాప్ రైడ్ లో సూపర్ సిక్స్..

నేషనల్ క్రష్ రష్మిక సక్సెస్ ఫెయిల్యూర్స్ తో సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళుతోంది. టాలీవుడ్ కోలీవుడ్ బాలీవుడ్ అని తేడా లేకుండా బడా సినిమాలను లైన్ లో పెడుతోంది. ఇక నాన్ స్టాప్ గా వరుస పెట్టి సినిమాలు రిలీజ్ చేసేందుకు సిద్ధమైంది. 2016లో 'కిరిక్ పార్టీ' సినిమాతో హీరోయిన్ గా కెరియర్ స్టార్ట్ చేసిన రష్మిక మందన్న, దీని తర్వాత కన్నడంలో 'అంజనీపుత్ర' సినిమా లో చేసింది. ఈ రెండు సూపర్ హిట్ అయ్యాయి. ఇక 2018లో 'చలో' సినిమాతో ఈ అమ్మడు టాలీవుడ్ లోకి అడుగుపెట్టి బ్లాక్ బస్టర్ అందుకుంది. తరువాత విజయ్ దేవరకొండతో 'గీతాగోవిందం' మూవీ చేసి మరో సూపర్ హిట్ ని ఖాతాలో వేసుకుంది. అక్కడి నుంచి రష్మిక వెనక్కి తిరిగి చూసుకోలేదు. బ్యాక్ టూ బ్యాక్ ప్రాజెక్ట్స్ తో వరుస విజయాలు అందుకొని స్టార్ హీరోయిన్ గా మారిపోయింది.



2021లో 'పుష్ప' సినిమాతో రష్మిక మందన పాన్ ఇండియా హీరోయిన్ గా మారిపోయింది. ఈ సినిమాతో బాలీవుడ్ ఆడియన్స్ కి కూడా రష్మిక బాగా కనెక్ట్ అయ్యింది. యూత్ క్రష్ గా రష్మిక మారిపోయింది. 'గుడ్ బై' సినిమాతో రష్మిక మందన హిందీలోకి అడుగుపెట్టింది. తరువాత 'మిషన్ మజ్ను' మూవీలో నటించింది. ఈ రెండు పెద్దగా మెప్పించలేదు. అయితే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణబీర్ కపూర్ కి జోడీగా చేసిన 'యానిమల్' తో బిగ్గెస్ట్ హిట్ ని బాలీవుడ్ లో సొంతం చేసుకుంది. ఈ సినిమాతో బాలీవుడ్ కూడా రష్మికకి డిమాండ్ పెరిగింది. విక్కీ కౌశల్ కి జోడీగా 'ఛావా' మూవీలో రష్మిక నటించింది. ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవిత కథతో ఈ సినిమా తెరకెక్కింది. హిందీలో మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ గా ఈ చిత్రం రాబోతోంది. మరో వైపు మోస్ట్ అవైటెడ్ మూవీ 'పుష్ప 2' రిలీజ్ కి రెడీ అవుతోంది. ఈ రెండు సినిమాలు కాకుండా రష్మిక చేతిలో ఆరు సినిమాలు ఉన్నాయి. 'రెయిన్ బో', 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాలు ఫీమేల్ సెంట్రిక్ కథలతో తెరకెక్కుతున్నాయి. అలాగే సల్మాన్ ఖాన్, మురుగదాస్ కాంబోలో తెరకెక్కుతోన్న 'సికందర్' సినిమాలో రష్మిక హీరోయిన్ గా చేస్తోంది. ధనుష్, శేఖర్ కమ్ముల కాంబోలో వస్తోన్న 'కుభేర'లో నటిస్తోంది. హిందీలో ఆయుష్మాన్ ఖురానాకి జోడీగా 'థమ' సినిమాలో హీరోయిన్ గా కన్ఫర్మ్ అయ్యింది. ఇవి కాకుండా విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రంలో రష్మిక హీరోయిన్ గా ఫిక్స్ అయ్యింది. మొత్తం రష్మిక చేతిలో ఏడు సినిమాలుండగా అందులో 'పుష్ప 2' ఈ ఏడాది రానుంది. మిగిలిన ఆరు ఐదు సినిమాలు 2025లో రిలీజ్ అవ్వబోతున్నాయి. ఈ సినిమాల తో బాలీవుడ్ లో రష్మిక మందన స్టార్ హీరోయిన్ గా మారిపోయిన ఆశ్చర్యపోవాల్సిన పని లేదని సినీ విశ్లేషకులు అంటున్నారు.

## హీరోయిన్ డెడికేషన్ కు హ్యాట్సాఫ్..!

కెరీర్ లో సక్సెస్ లేకపోతే కొంతమందికి అవకాశం వచ్చినా ఏదో వచ్చిందిలే చేసేద్దాం లే అన్నట్టుగా ఉంటుంది. ముఖ్యంగా అసలేమాత్రం ఫాం లో లేని భామలు కొన్ని ఛాన్స్ లు వచ్చినా అంతగా ఆసక్తి పెట్టలేరు. కానీ తెలుగు అమ్మాయి రీతు వర్మ వాళ్లకి భిన్నంగా ఛాన్స్ వచ్చింది అంటే చాలు దాని కోసం ప్రాణం పెట్టేస్తుంది. హిట్లు ఫ్లాపులు అనేవి కొన్నిసార్లు లక్ ని బట్టి తగులుతాయి. ఐతే సినిమాకు తాము పెట్టాల్సిన ఎఫర్ట్స్, పడాల్సిన కష్టం పడ్డాక ఒకవేళ అది వర్క్ అవుట్ కాకపోయినా సరే అందులో నటించిన హీరోలైనా, హీరోయిన్స్ అయినా పెద్దగా ఫీల్ అవ్వరు. అలాంటి కేటగిరిలోకే వస్తుంది రీతు వర్మ. ఇప్పటివరకు చేసిన సినిమాల్లో సక్సెస్ ల కన్నా ఫ్లాపులే ఎక్కువ అయినా కూడా అమ్మడు ఎక్కడ కాన్ఫిడెన్స్ లూజ్ అవ్వట్లేదు. అందుకే వచ్చిన పాత్రకు తన డెడికేషన్ చూపించి పాత్రకు కొత్త వన్నె తెస్తుంది. ప్రస్తుతం రీతు వర్మ శ్రీ విష్ణుతో శ్వాగ్ సినిమాలో నటించింది.



సినిమాలో ఆమెది చాలా ఇంపార్టెంట్ రోల్ అని తెలుస్తుంది. మూడు తరాల కథలతో వస్తున్న శ్వాగ్ సినిమాలో రీతు వర్మ కూడా రెండు వేరియేషన్స్ ఉన్న పాత్రలో నటించింది. ఐతే ముఖ్యంగా ఒక పాత్ర కోసం అమ్మడు చాలా వెయిట్ లాస్ అయినట్టు తెలుస్తుంది. శ్వాగ్ సినిమాలో రుక్మిణి దేవి పాత్ర కోసం రీతు వర్మ చాలా బరువు తగ్గారట. సినిమా కోసమే తను చేస్తున్న పాత్ర కోసమే రుక్మిణి వెయిట్ లాస్ అయినట్టు తెలుస్తుంది. సినిమా కోసం ఆమె చూపించే డెడికేషన్ చూసిన కొందరు ఇలాంటి వారికి తప్పకుండా సక్సెస్ రావాలని అంటున్నారు. వరుస సక్సెస్ లతో ఫాం లో ఉన్న శ్రీ విష్ణు శ్వాగ్ తో హ్యాట్రిక్ కొడతాడా.. కెరీర్ లో అసలు దూకుడు లేని రీతు వర్మ కెరీర్ లో జోష్ వచ్చేలా చేస్తాడా అన్నది చూడాలి. శ్వాగ్ సినిమాతో రీతు వర్మ తిరిగి ఫాం లోకి రావాలని ఆమె ఫ్యాన్స్ కూడా కోరుతున్నారు. అక్టోబర్ 4న రిలీజ్ అవుతున్న ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి. హసిత్ గోలి డైరెక్ట్ చేసిన శ్వాగ్ సినిమా రిజల్ట్ మీద చిత్ర యూనిట్ అంతా సూపర్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన విషయం తెలిసిందే.




## 'రాబిన్‌హుడ్' టీజర్.. హై-ఫై ఇళ్లను టార్గెట్ చేసే హనీసింగ్!




యంగ్ హీరో నితిన్, డైరెక్టర్ వెంకీ కుడుముల కాంబినేషన్ లో తెరకెక్కుతున్న యూనిక్ యాక్షన్ అండ్ హీస్ట్ కామెడీ "రాబిన్‌హుడ్". 'భీష్మ' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరూ కలిసి చేస్తున్న ఈ సినిమాపై అందరిలో మంచి అంచనాలే ఉన్నాయి. ఇందులో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా నటిస్తోంది. ఆల్రెడీ ఈ సినిమా నుంచి వచ్చిన క్యారెక్టర్ పోస్టర్లు, గ్లింప్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. వచ్చే నెలలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ మూవీ టీజర్ ను మేకర్స్ తాజాగా విడుదల చేసారు. "ఆగని హై-ఫై ఇళ్లల్లో చోరీలు.. ఇంతమంది దాచుకున్న హనీని దోచుకుపోతున్న హనీ సింగ్ ఎవరు?" అంటూ న్యూస్ రీడర్స్ స్టైల్ చెప్పే పవర్ ఫుల్ వాయిస్ ఓవర్‌తో ఈ టీజర్ ప్రారంభమైంది. హై-ఫై ఇళ్లను టార్గెట్ గా చేసుకుని, రకరకాల వేషాలు వేసుకొని దోపిడీలు చేసే మోడరన్ రాబిన్‌హుడ్‌గా నితిన్ పరిచయం చేయబడ్డాడు. అతన్ని పట్టుకోడానికి ప్రయత్నించే పోలీస్ ఆఫీసర్ గా మలయాళ నటుడు షైన్ టామ్ చాకో కనిపించారు. "రాబిన్ హుడ్ కి పర్టిక్యులర్ జెండా అజెండాలు ఏమీ లేవు.. డబ్బు కోసం వాడు ఎవడికైనా ఎదురెళ్తాడు" అంటూ నితిన్ పాత్ర స్వభావాన్ని వెల్లడించారు. అతను ధనవంతురాలైన, పవర్ ఫుల్ ఫ్యామిలీ బ్యాగ్రౌండ్ ఉన్న శ్రీలీలను చూసి ప్రేమలో పడతాడు. అయితే శ్రీలీలను చూసి నితిన్ ఎగ్జైట్ అవుతున్నాడు కానీ, ఆమె కుటుంబంలో ప్రమాదకరమైన విలన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. రాబరీలు చేసుకునే రాబిన్ హుడ్ జీవితం, ప్రేమలో పడిన తర్వాత మరింత ప్రమాదకరంగా మారినట్లు టీజర్ లో చూపించారు. నితిన్ రాబిన్‌హుడ్ పాత్రలో, విభిన్నమైన లుక్స్ లో డైనమిక్ పెర్ఫార్మెన్స్ అందించాడు. ఓవైపు దోపిడీలు చేస్తూనే, మరోవైపు "ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్.. నా కంట్రీకి వచ్చి నా ఫ్యామిలీనే ఇబ్బంది పెడతార్రా.. యూ బ్లడీ ఫారినర్స్" అంటూ రౌడీలను చితక్కొడుతూ దేశభక్తిని చూపిస్తున్నాడు. చివర్లో అరబ్ షేక్‌గా కనిపించి ఆకట్టుకున్నాడు. అరబ్ షేక్ గెటప్ లో ఎందుకు ఉన్నావని పోలీసులు ప్రశ్నిస్తే, పంజాబీ అయితేనే పంజాబీ డ్రెస్ వేసుకోవాలా? అంటూ నితిన్ లాజిక్స్ మాట్లాడటం నవ్వు తెప్పిస్తుంది. అడ్వెంచర్, యాక్షన్, ఎంటర్టైన్మెంట్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కలబోసి దర్శకుడు వెంకీ కుడుముల ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు టీజర్ తోనే క్లారిటీ ఇచ్చాడు.. ప్రమోషన్ మెటీరియల్ తోనే సినిమాపై ఆసక్తిని కలిగించాడు. దీంట్లో శ్రీలీల డబ్బున్న అహంకారి మహిళ పాత్ర పోషించింది. టీజర్ లో ఎంతో అందంగా కనిపించింది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్, మైమ్ గోపీ పాత్రలను కూడా పరిచయం చేసారు. అయితే శ్రీలీల వెనకున్న ఆ విలన్ ఎవరనేది రివీల్ చెయ్యలేదు. జివి ప్రకాష్ కుమార్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సాయి శ్రీరామ్ కెమెరా వర్క్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

ప్రొడక్షన్ వాల్యూస్ రిచ్ గా ఉన్నాయి. ఈ చిత్రానికి కోటి ఎడిటర్ గా, రామ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు. రామ్-లక్ష్మణ్, రవివర్మ, వికారం మోర్ మాస్టర్స్ ఈ సినిమాలో యాక్షన్ కొరియోగ్రఫీ చేసారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 'రాబిన్ హుడ్' మూవీని క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 20న రిలీజ్ చెయ్యాలని భావించారు. కానీ ఇప్పుడు 'పుష్ప 2' లాంగ్ రన్ కోసం డిసెంబర్ 25న విడుదల చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

## హీరో విలనిజం.. అలా సెట్ చేశారు..!



ఒకప్పుడు హీరో అంటే కేవలం హీరో పాత్ర మాత్రమే చేసే వారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది హీరోలే విలన్లుగా మారి ఫ్యాన్స్ ని మెప్పిస్తున్నారు. హీరో, విలన్ చేసే పాత్ర ఏదైనా ప్రేక్షకులను అలరించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నారు. స్టార్ హీరోల్లో కొందరు తమ ఇమేజ్ ని పక్కన పెట్టి విలన్ గా కూడా అదరగొట్టేస్తున్నారు. అలాంటి వారిలో ముందుగా చెప్పుకోవాల్సి వస్తే టాలీవుడ్ లో రానా ముందుంటాడు. బాహుబలి ఎంత బలవంతుడు అన్నది తెలియాలంటే అతని ప్రతినాయకుడు భళ్లాలదేవా ఎంత బలవంతుడో తెలుసుకోవాలి. ఆ సినిమాలో ప్రభాస్, రానా ఫైట్ నెక్స్ట్ లెవెల్ లో ఉంటుంది. అందుకే సినిమాను సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ హిట్ చేశారు. ఇక తమిళ పరిశ్రమలో ఓ పక్క విజయ్ సేతుపతి హీరోగా లీడ్ సినిమాలు చేస్తూనే విలన్ గా మెప్పిస్తున్నాడు. తెలుగులో ఉప్పెనలో శేషారాయణం రోల్ చేసిన విజయ్ సేతుపతి ఆ సినిమాలో ఆ పాత్రలో ఆయన తప్ప వేరే ఎవరు అంత బాగా చేయలేరని అనిపించేలా చేశారు. ఇక తమిళ్ లో మాస్టర్, విక్రం ఇలా ప్రతి సినిమాలో విలన్ గా ఆడియన్స్ ను అలరిస్తున్నారు. కోలీవుడ్ లో సూర్య కూడా రోలెక్స్ పాత్రలో తనలోని నెగిటివ్ షేడ్ తో అదరగొట్టాడు. రోలెక్స్ ఫుల్ సినిమా కోసం ఆడియన్స్ అంతా ఎదురుచూస్తున్నారు. మలయాళం నుంచి ఫహద్ ఫాజిల్ ఎలాంటి సినిమాలో అయినా నటించే సత్తా ఉన్న నటుడిగా ప్రూవ్ చేసుకుంటున్నాడు. ఫహద్ సినిమాలో ఉన్నాడు అంటే ఒక వెరైటీ రోల్ లో మెప్పిస్తాడని ఫిక్స్ అయ్యారు ఆడియన్స్. పుష్ప సినిమాలో ఫహద్ చేసిన పాత్ర హైలెట్ గా మారింది. పుష్ప 2 లో ఇది నెక్స్ట్ లెవెల్ లో ఉంటుందని టాక్. కన్నడ పరిశ్రమ నుంచి వచ్చిన కిచ్చ సుదీప్ అక్కడ ఆయన స్టార్ హీరో అయినా తెలుగులో ఈగ సినిమాలో విలన్ గా మెప్పించారు. తానొక స్టార్ అయ్యుండి విలన్ గా ఆయన నటించిన తీరు ఇంప్రెస్ చేసింది. ఇప్పటికీ తెలుగులో నెగిటివ్ రోల్ వస్తే చేసేందుకు సిద్ధమని అంటున్నాడు కిచ్చ సుదీప్. స్టార్ హీరోలే కాదు యువ హీరోలు కూడా విలన్ గా మెప్పించేందుకు రెడీ అంటున్నారు. ఈమధ్య సినిమాల్లో విలన్ పాత్రలు కూడా సంథింగ్ స్పెషల్ గా ఉంటున్నాయి కాబట్టి విలన్ గా కూడా నటించి వావ్ అనిపించేస్తున్నారు.

## సీరత్ కపూర్.. గ్లామర్ తో క్యూట్ స్టైల్

సీరత్ కపూర్.. అమ్మడు ఇండస్ట్రీలోకి వచ్చి చాలా కాలమైంది కానీ ఇంకా సరైన రీతిలో కెరీర్ ను సెట్ చేసుకోలేదు. అయితే గ్యాప్ లేకుండా రెగ్యులర్ గా ఏదో ఒక సినిమాలో కనిపించే ప్రయత్నం చేస్తోంది. అలాగే సోషల్ మీడియాలో కూడా అమ్మడు గ్లామర్ ప్రజెంటేషన్ తో నెటిజన్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఇక రీసెంట్ గా మరోసారి తన సొగసుతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫొటోలో ఆమె స్ట్రిప్డ్ టాప్ మరియు డెనిమ్ ఓవర్‌ఆల్‌తో కూల్ లుక్‌లో కనిపించింది. "చుట్టూ చూడండి, ఎల్లప్పుడూ మార్గదర్శక సంకేతం ఉంటుంది!" అనే క్యాప్షన్ తో పోస్ట్ చేసిన ఈ ఫోటోలో సీరత్ క్యూట్ స్మైల్ తో అభిమానులను ఆకట్టుకుంది. ఈ ఫోటోలో ఆమెను చూసి,



నెటిజన్లు ఫ్యాషన్ సెన్స్ మరియు చార్మ్‌కు ఫిదా అవుతున్నారు. సీరత్ కపూర్ తన సినీ కెరీర్‌ను 2014లో వచ్చిన రన్ రాజా రన్ చిత్రంతో ప్రారంభించింది. మొదటి చిత్రమే అయినా ఆమె నటనలో చూపిన నైపుణ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ సినిమా ద్వారా యూత్ హృదయాలను గెలుచుకున్న సీరత్, గ్లామర్ తో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. తరువాత ఆమె టైగర్, కృష్ణ అండ్ హిజ్ లీలా, మా వినతా వంటి సినిమాల్లో తన ప్రతిభను ప్రదర్శించింది. ఇటీవల ఆమె భామాకలాపం 2, మనమే వంటి సినిమాల్లో నటించి, తన యాక్టింగ్ స్కిల్స్‌ను మరింత మెరుగుపర్చుకుంది. సీరత్ కపూర్ కి కెరీర్‌లో పెద్ద హిట్ లభించకపోయినప్పటికీ, ఆమె తన గ్లామర్ మరియు ప్రదర్శనతో అభిమానులను ఆకర్షించడంలో విజయవంతం అవుతోంది. ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా ఫ్యాన్స్‌కు నిత్యం టచ్‌లో ఉండే సీరత్, తరచుగా ఫోటోషూట్ల ద్వారా తన గ్లామర్ ప్రెజె న్స్‌ను ఫ్యాన్స్‌తో పంచుకుంటోంది. తాజాగా ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన ఈ ఫోటోలో ఆమె అందాన్ని హైలెట్ చేస్తూ, తన అందంతో యువతకు మంత్ర ముగ్ధులను చేసింది. సీరత్ కపూర్ కెరీర్‌లో మంచి ఆఫర్లు కోసం ఎదురుచూస్తూ, తన ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ద్వారా ఇమేజ్‌ను మరింత పెంచుకుంటోంది. టాలీవుడ్‌లో ఆమెకి మంచి అవకాశాలు వస్తే, మరింత పాపులారిటీని సంపాదించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## సోనమ్ గోల్డ్ స్కర్ట్ సూట్ స్టన్నింగ్

సోనమ్ కపూర్ పరిచయం అవసరం లేదు. ధనుష్ సరసన రాంజానా లాంటి జాతీయ అవార్డ్ చిత్రంలో నటించిన సోనమ్ పలు సినిమాల్లో అవార్డ్ విన్నింగ్ ప్రదర్శనలతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. ఇటీవల సోనమ్ సినిమాలను తగ్గించి తన బిజినెస్‌మేన్ హబ్బీతో కలిసి విదేశాల్లో నివసిస్తోంది. అయినా సోషల్ మీడియాల్లో నిరంతరం తనదైన ఫ్యాషన్ సెన్స్ తో హాట్ టాపిక్ గా మారుతూనే ఉంది. తాజాగా సోనమ్ గోల్డ్ కలర్ స్కర్ట్ సూట్‌లో మెరిసిపోయింది. ఈవెంట్లో మెరిసే కోచర్ స్కర్ట్ సూట్‌లో కనిపించగా.. ఇది తమరా రాల్ఫ్ 2024 కలెక్షన్ నుండి ఎంపిక చేసుకున్న డిజైనర్ లుక్. దీనికి



గొలుసు అలంకరణ.. మోకాళ్ల వరకు ఉన్న దుస్తులకు గోల్డ్ షేడ్స్‌లో ఉన్నాయి. తన అలంకరణకు తగ్గట్టుగా బంగారు నగలతోను అలంకరించుకుంది. చంకీ చైన్ స్టేట్‌మెంట్ గోల్డ్ నెక్లెస్ పెద్ద స్టడ్ చెవిపోగులతో సోనమ్ ఒద్దికగా కనిపించింది. ఈ లుక్ ని డిజైన్ చేసినది ఇంతకీ ఎవరు? అంటే.. మరెవరో కాదు.. ప్రముఖ నిర్మాత, సోనమ్ సోదరి రియా కపూర్ ఈ లుక్ ని డిజైన్ చేసింది. ప్రస్తుతం ఇది అంతర్జాలంలో వైరల్ గా మారింది. సోనమ్ లుక్ కి రియాక్షన్స్ ఒక రేంజులో ఉన్నాయి. ఈ లుక్ అద్భుతంగా ఉందంటూ నటి భూమి పెడ్నేకర్ వ్యాఖ్యానించారు. సోనమ్ భర్త, వ్యాపారవేత్త ఆనంద్ అహూజా వైల్డ్ అని రాశారు. సోనమ్ లుక్‌పైనా, రియా పోస్ట్‌పైనా ఒక అభిమాని వ్యాఖ్యానించాడు. ఫ్యాషన్ ఐకాన్.. ఫ్యాషన్ క్వీన్ అని కొందరు వ్యాఖ్యానించారు. స్కర్ట్ సూట్ లాయలిస్ట్‌లుగా మారుతున్న అనేక మంది ప్రముఖుల్లో సోనమ్ ఒకరు .. బ్లేజర్ ం స్కర్ట్స్ కాంబినేషన్ తో సోనమ్ ప్రత్యేకతను ఆపాదిస్తోందని పలువురు ప్రశంసించారు.



# భారాస నేతలు రైతులను రెచ్చగొడుతున్నారు: తెలంగాణ మంత్రులు

హైదరాబాద్: భారాస నేతలు రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణ మంత్రులు మండిపడ్డారు. గత భారాస ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు మాట్లాడారు. ఆర్థిక కష్టాలున్నా.. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామన్నారు. "రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం సన్నధాన్యానికి బోనస్ ఇస్తాం. రైతుల కష్టాలపై భారాస నేతలు మొసలికన్నీరు కారుస్తున్నారు. సన్న ధాన్యం సేకరించిన వారంలోపు బోనస్ చెల్లిస్తాం. రైతులకు మేలు చేసేందుకు ఏదైనా సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరాం.

ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్నీ అడ్డుకోవాలని చూస్తున్నారు. 66.77 లక్షల ఎకరాల్లో 146 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యింది. రైతులపై భాజపాకి ప్రేమ ఉంటే తేమశాతం నిబంధనలు మార్చాలి" అని పేర్కొన్నారు.




భారతీయులు శ్రమించి పనిచేస్తేనే దేశం ముందుకుపోతు ందని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి పేర్కొన్నారు. వారానికి ఆరు పని దినాల విధానానికే తుదివరకు తన మద్దతు ఉంటుందని తేల్చి చెప్పారు. ఆయన సీఎన్‌బీసీ గ్లోబల్ లీడర్‌షిప్ సదస్సులో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "నన్ను క్షమించండి. నేను నా భావాలను మార్చుకోలేను. నా తుది వరకు దీనికి నేను కట్టుబడి ఉంటాను. ప్రధాని మోదీ తీవ్రంగా శ్రమిస్తున్నారు. మనం కూడా అలానే కష్టపడటమే అతనికి మనం ఇచ్చే గౌరవం. భారత్ వృద్ధి త్యాగాలు, ప్రయత్నాలపైనే ఆధారపడి ఉంటుంది కానీ.. సౌకర్యాలు, విశ్రాంతిపై కాదు. బలమైన పని విలువలు లేని దేశం.. ప్రపంచ స్థాయిలో పోటీపడటంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంది" అని ఆయన పేర్కొన్నారు.

**నేను 14 గంటలు పనిచేశాను..** ఈసందర్భంగా నారాయణమూర్తి తన కెరీర్‌లో పడిన శ్రమను వివరించారు. తాను రోజుకు 14గంటల చొప్పున వారానికి ఆరున్నర రోజులు పని చేసేవాడినని పేర్కొన్నారు. ఉదయం 6.30 గంటలకు ఆఫీస్ వద్ద మొదలయ్యే ఆయన రొటీన్‌గా రాత్రి 8.40కు పని ముగించేవాడినని వివరించారు. తాను ఆ రకంగా కష్టపడి పనిచేయడానికి గర్విస్తానని పేర్కొన్నారు. శ్రమించడం అనేది వ్యక్తిగత ఎంపిక కాదని.. చదువుకున్న ప్రతిఒక్కరి బాధ్యత అని నారాయణమూర్తి పేర్కొన్నారు. భారత్‌లో దీనికి చాలా మినహాయింపులు ఉన్నాయన్నారు. అంకితభావంతో పనిచేయడమనేది భారతీయ సంస్కృతి అని తెలిపారు. కొన్నాళ్ల క్రితం నారాయణమూర్తి ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. భారత్‌లో మిలీనియల్స్ వారానికి 70 గంటలు శ్రమించాలని చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. దీనిపై ఆయన తీవ్ర విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. ప్రతిభ, తెలివితేటలతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ శ్రమించడమే దేశానికి అవసరమన్నారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత జర్మనీ, జపాన్ ఆర్థికంగా చితికిపోయాయి. దీంతో అక్కడి ప్రజలు తీవ్రస్థాయిలో శ్రమించి తిరిగి తమ ఆర్థికవ్యవస్థలను ప్రపంచంలోనే టాప్‌లోకి తీసుకొచ్చారు. అలా శ్రమించి ఇక్కడి ఉద్యోగులు భారత్‌ను ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలని నారాయణమూర్తి గతంలో పేర్కొన్నారు. లక్ష్యానికి కట్టుబడి శ్రమించే ఉద్యోగులు ఉంటే అవి ఏ స్థాయిలో అభివృద్ధి చెందుతాయో అన్నది ఈ దేశాలు నిరూపించాయని ఆయన తెలిపారు. శ్రమకు ఎటువంటి ప్రత్యామ్నాయం లేదని ఆయన బలంగా విశ్వసిస్తారు.




హైదరాబాద్: తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు చేశామని, మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు.

సికింద్రాబాద్ టూరిజం ప్లాజాలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. మాటలు ప్రజలకు.. మూటలు పార్టీకి అన్నట్లుగా.. కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రలో ఏ ముఖం పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. అశోక్‌నగర్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇంకా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించలేదు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం చెందిందన్నారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుచేయలేదని విమర్శించారు.

**ఈనెల 21 నుంచి 24 వరకు లోక్‌మంథన్ కార్యక్రమం..** శిల్పకళావేదికలో ఈనెల 21 నుంచి 24 వరకు లోక్ మంథన్ నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట పర్యాటక భవన్‌లో లోక్ మంథన్‌పై కేంద్రమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈ ఏడాదిలో అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవంగా లోక్‌మంథన్‌ను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 21న స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, 22న లోక్‌మంథన్‌ను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రారంభిస్తారని కిషన్‌రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా 24న జరిగే ముగింపు కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, గజేంద్ర సింగ్ షేకావత్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కవులు, కళాకారులు, విదేశీ అతిథులు హాజరుకానున్నట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు.




అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఐక్యరాజ్యసమితికి టెహ్రాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవానితో ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ భేటీ అయ్యారు. ఓ రహస్య ప్రదేశంలో గంటకు పైగా వీరిద్దరి మధ్య చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇరాన్ విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ కథనం వెల్లడించింది. టెహ్రాన్-వాషింగ్టన్ మధ్య ఉద్రిక్తతల గురించి వీరిద్దరూ చర్చించారని, వీరి సమావేశం ఫలప్రదం అయ్యిందని సదరు వర్గాలు చెప్పినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను తొలగించాలని, టెహ్రాన్‌తో వాణిజ్యం చేయాలని ఆ దేశ రాయబారి మస్క్‌ను కోరినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. అయితే, వీరి భేటీపై అటు ట్రంప్-మస్క్ వర్గం నుంచి గానీ.. ఐరాసలోని ఇరాన్ మిషన్ నుంచి ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. ఒకవేళ ఈ వార్తలు నిజమైతే.. ఇరాన్‌తో దౌత్య సంబంధాలను పునరుద్ధరించుకునే ఆలోచనలో ట్రంప్ ఉన్నారనే దానికి ఈ భేటీ సంకేతం కానుంది. ఇటీవల ఇరాన్ సైనిక స్థావరాలపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దాడులకు ఆదేశించిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల విషయంలో ఓవైపు ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటిస్తూనే.. ఇరాన్‌తో దౌత్యానికి సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్ సూచనప్రాయంగా చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాను గ్రేట్ డీల్‌మేకర్ తన చివరి ప్రచార ర్యాలీల్లో ఆయన టెహ్రాన్ గురించి పరోక్షంగా స్పందించారు. ఈ పరిణామాల వేళ తాజాగా మస్క్-అమీర్ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక, ట్రంప్ నూతన కార్యవర్గంలో ఎలాన్ మస్క్‌కు కీలక బాధ్యతలు దక్కిన సంగతి తెలిసిందే.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవ ర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) విభాగానికి మస్క్, వివేక్ రామస్వామిని ట్రంప్ సంయుక్త సారథులుగా నియమించారు. అంతేకాదు.. అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ట్రంప్ పలువురు దేశాధినేతలతో ఫోన్‌లో సంభాషించారు. ఆ సమయంలోనూ మస్క్ ఆయన పక్కనే ఉన్నట్లు వార్తలు వచ్చాయి.




హైదరాబాద్: కుల గణన సర్వే ఎవరికీ వ్యతిరేకం కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని దోభిఘాట్ గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. ఇక్కడ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. దోభిఘాట్ గ్రౌండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని చెప్పారు. కులగణన సర్వేలో బ్యాంకు ఖాతా వివరాలు అడగట్లేదని స్పష్టం చేశారు. కులం వివరాలు చెప్పడం ఇష్టం లేకుంటే 999 ఆప్షన్ ఉంటుందని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే 30 శాతం కులగణన సర్వే పూర్తయిందని తెలిపారు. సర్వేలో ఎలాంటి అపోహాలు వద్దన్నారు. రాజకీయ కుట్ర చేసేవారే వీటిని సృష్టిస్తున్నారని చెప్పారు. కులగణన సర్వే వల్ల కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టవచ్చుని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# తన పదవి ఐదేళ్లే అని రేవంత్‌రెడ్డి గుర్తు పెట్టుకోవాలి: కేటీఆర్



కంది: కష్టపడి సాధించుకున్న తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి రాబందులా మారారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. లగచర్ల ఘటన నిందితులతో సంగారెడ్డి సెంట్రల్ జైలులో ములాఖత్ అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో రేవంత్‌రెడ్డి ఫార్మా కంపెనీలను విమర్శించారని చెప్పారు. ఇప్పుడు మాత్రం వేల ఎకరాలు కావాలంటున్నారని పేర్కొన్నారు. కులగణనలో పాల్గొన్న వ్యక్తిని కూడా అక్రమంగా అరెస్టు చేశారని చెప్పారు. వేరే చోట ఐటీఐ చదువుకున్న విద్యార్థిని కూడా అరెస్టు చేశారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా లగచర్లలో ఆందోళనలో పాల్గొన్నారని పేర్కొన్నారు. కేవలం భారాస కార్యకర్తలనే అరెస్టు చేశారని ఆరోపించారు. చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ సర్కారు యత్నిస్తోందని మండిపడ్డారు. కావాలనే ఈ ఘటనకు రాజకీయ రంగు పులిమారన్నారు. "సీఎం అన్న తిరుపతిరెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఫోన్‌లో ఆదేశాలిస్తున్నారు.. అధికారులు పాటిస్తున్నారు. తన పదవి ఐదేళ్లే అని రేవంత్‌రెడ్డి గుర్తు పెట్టుకోవాలి. కొడంగల్‌ను అల్లుడి ఫార్మా కంపెనీకి రాసివ్వాలన్నదే ఆయన యత్నం. ఇవాళ కొడంగల్ తిరగబడింది.. రేపు తెలంగాణ తిరగబడుతుంది. అధికారంలోకి వచ్చాక ఏం చేయాలో మాకు తెలుసు. కేసులెన్ని పెట్టినా భారాస కార్యకర్తలు భయపడొద్దు. ఎకరం రూ.60 లక్షల భూమిని రూ.10 లక్షలకు గుంజుకునే యత్నం జరుగుతోంది. పేదవాడి కన్నీళ్ల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుంది. రేవంత్‌రెడ్డి చేతనైతే మాతో కొట్లాడాలి.. అమాయకులతో కాదు" అని కేటీఆర్ చెప్పారు.

# హైదరాబాద్‌లో అలెగ్రో మైక్రో సిస్టమ్స్ ఏర్పాటు.. 500 మందికి ఉద్యోగావకాశాలు: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులకు ఎంతో అనుకూలమైన వాతావరణం ఉందని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో పలు అంతర్జాతీయ కంపెనీలు ముందుకువస్తున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అంతర్జాతీయ సెమీకండక్టర్ల కంపెనీ అలెగ్రో మైక్రోసిస్టమ్స్ హైదరాబాద్‌లో పరిశోధనాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేయడానికి ముందుకువచ్చిందని మంత్రి చెప్పారు. ఈమేరకు ఆ కంపెనీ సీఈఓ వినీత్ బృందం.. సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును కలిసింది. పలు ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీలకు సెమీ కండక్టర్లు సరఫరా చేస్తున్నట్లు అలెగ్రో ప్రతినిధులు మంత్రికి వివరించారు. పెట్టుబడిదారులకు సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ముందుంటుందని మంత్రి వెల్లడించారు. అలెగ్రో పరిశోధనాభివృద్ధి సంస్థ ఏర్పాటుతో 500 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు.



# పట్నం నరేందర్‌రెడ్డి పిటిషన్‌ను తిరస్కరించిన హైకోర్టు

హైదరాబాద్: భారాస నేత, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని ప్రత్యేక బ్యారక్‌లో ఉంచాలని కోరుతూ ఆయన తరఫు న్యాయవాది హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. నరేందర్ రెడ్డిని నేరస్థులతో కలిపి ఉంచారని.. అలా కాకుండా స్పెషల్ బ్యారక్‌లో పెట్టాలని కోరారు. పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం... తిరస్కరిస్తూ తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం నరేందర్ రెడ్డి చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.



# ఔరంగజేబు విధానాలు ఇప్పటికీ ప్రజలను పీడిస్తున్నాయి: ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్: ఔరంగజేబు విధానాలు ఇప్పటికీ ప్రజలను పీడిస్తున్నాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "300 ఏళ్ల క్రితం ఔరంగజేబు నోటి మాటతో భూములు ఇచ్చి ఉండొచ్చు. కానీ, నేడు కుప్పలు కుప్పలుగా డాక్యుమెంట్స్‌తో ఆ భూములు మావి అని అంటున్నారు. ప్రజాస్వామ్యంలో సుప్రీంకోర్టు కీలకం.. ఎవరైనా సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాల్సిందే. రాజ్యాంగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ వక్ఫ్ బోర్డును తీసుకొచ్చింది. సుప్రీంకోర్టుకు మించి వక్ఫ్ బోర్డుకు అధికారాలిచ్చారు. వక్ఫ్ బోర్డు అనేది ఒక క్రూరమైన హాస్యం. నవ్వాలో.. ఏడవాలో.. బాధపడాలో తెలియని పరిస్థితి. శీతాకాల సమావేశాల్లో వక్ఫ్‌బోర్డు బిల్లు పార్లమెంట్‌లో పాస్ అవుతుంది. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ముస్లిం సమాజానికి వ్యతిరేకం కాదు" అని ఎంపీ అన్నారు.



# గాడిద పాల పేరిట ఘరానా మోసం.. రూ.100 కోట్లు నష్టపోయామన్న బాధితులు

హైదరాబాద్: ఇటీవల ఎక్కడ చూసినా గాడిద పాల గురించి విస్తృత చర్చ నడుస్తోంది. మార్కెట్లో దీనికున్న హైప్, డిమాండ్‌ను ఆసరాగా తీసుకుని తమిళనాడుకు చెందిన ఓ ముఠా గాడిదపాల ఉత్పత్తి, లాభాల పేరుతో ఆశ చూపి ఔత్సాహిక రైతులను నమ్మించి మోసం చేసింది. తాజాగా తెలుగు రాష్ట్రాల్లో గాడిదపాల కుంభకోణం వెలుగు చూసింది. ఫ్రాంచైజీ మోడల్‌లో గాడిద పాలు తీసుకొని ఓ సంస్థ దాదాపు రూ.100 కోట్ల వరకు ఎగవేసిందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధిత రైతులు తమ గోడు వెలిబుచ్చారు. చెన్నైలోని డాంకీ ప్యాలెస్ ఫ్రాంచైజీ గ్రూపు సభ్యులు తమను నమ్మించి నిలువునా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కొవిడ్ నేపథ్యంలో బహుళ పోషకాలు, రోగ నిరోధక శక్తి ఇచ్చే గాడిద పాలకు డిమాండ్ ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో అవి చూసి సంప్రదించాం. డాంకీ ప్యాలెస్ మిస్టర్ బాబు ఉలగనాథన్ ఆధ్వర్యంలో గిరి సుందర్, బాలాజీ, సోనికరెడ్డి, డాక్టర్ రమేశ్ బృందం సెక్యూరిటీ డిపాజిట్ కింద ఒక్క రైతు వద్ద రూ.5లక్షలు తీసుకున్నారు. ఒక్కో పాడి గాడిదను రూ.80వేల నుంచి రూ.1.50లక్షల చొప్పున విక్రయించారు. ఆ గాడిదల నుంచి ఉత్పత్తి చేసిన పాలు లీటరు రూ.1600 చొప్పున సేకరిస్తామని ఒప్పందం చేసుకున్నారు. 3 నెలల పాటు నమ్మకం కలిగించేలా నగదు చెల్లించారు. గత 18 నెలలుగా డాంకీ ప్యాలెస్‌కు సరఫరా చేసిన పాల డబ్బులు, నిర్వహణ ఖర్చులు, షెడ్ నిర్మాణం, సిబ్బంది జీతాలు, వెటర్నరీ చికిత్స ఖర్చులు ఇవ్వడం లేదు. దీనిపై ప్రశ్నిస్తే ఒక్కొక్కరికీ రూ.15 లక్షల నుంచి రూ.70లక్షల వరకు బ్యాంకు చెక్కులు రాసిచ్చారు. అవి బ్యాంకులో వేస్తే బౌన్స్ అయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో దాదాపు 400 మందికి పైగా రైతులు తమలాగా రూ.100 కోట్ల వరకు నష్టపోయారు. ఇదో పెద్ద కుంభకోణం.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com